
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 21 డిసెంబరు 2024
3



## భద్రాద్రిలో బాల భీముడు

**5.25 కిలోల బరువుతో శిశువు జననం**



భద్రాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో శుక్రవారం ఓ మహిళ 5.25 కిలోల బరువున్న శిశువుకు జన్మనిచ్చింది. సాధారణంగా జన్మించిన శిశువు 2 నుంచి 4 కిలోల మధ్య బరువుతో జన్మిస్తారు. కానీ బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామానికి చెందిన మడకం నందినికి శుక్రవారం ఏరియా వైద్యశాలలో డాక్టర్ సాత్విక, డాక్టర్ మల్లేష్‌లు కాన్పు నిర్వహించారు. నందినికి మూడో కాన్పులో బాగంగా మగ శిశువు అధిక బరువు, పూర్తి ఆరోగ్యంతో జన్మించడం విశేషమని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో పుట్టిన ఇద్దరు మగవారేనని వైద్యులు తెలిపారు.

## బియ్యం బస్తాల్లో వరిపొట్టు

- రేషన్‌షాపులో స్వాహాపర్వం
- అధికారులకు అనుమానం రాకుండా డీలర్ ప్లాన్



తల్లాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం స్వాహా చేసి అనుమానం రాకుండా ఖాళీ అయిన బస్తాల్లో వరిపొట్టు నింపిన డీలర్ ఉదంతమిది. రెవెన్యూ అధికారి తనిఖీలో డీలర్ పాల్పడిన అక్రమం బయటపడింది. 33 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా బయటకు తరలించడంతో రేషన్‌షాపును సీజ్ చేశారు. ఈ సంఘటన శుక్రవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలోని రేషన్‌షాపులో చోటుచేసుకుంది. తహసీల్దార్ ఏ.వనజ సమాచారం మేరకు ఎంఆర్ఐ ఖాజామోహిద్దీన్ మిట్టపల్లిలోని రేషన్‌షాపు (నెంబర్5)ను తనిఖీ చేశారు. రేషన్‌షాపులో 58 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉండాల్సి ఉండగా 25 క్వింటాళ్ల బియ్యం మాత్రమే ఉన్నాయి. దీంతో 33 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం వచ్చింది. కాగా రేషన్‌షాపులో బియ్యం బస్తాలను క్షుణ్ణంగా పరిశీలించగా 33 క్వింటాళ్ల బియ్యానికి బదులుగా బస్తాల్లో వరిపొట్టును నింపిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు రేషన్‌షాపును సీజ్ చేసి డీలర్ మోత్కూరి వేదమహేశ్వరిపై 6ఏ కేసు నమోదు చేసినట్టు ఎంఆర్ఐ తెలిపారు.

## ఐ యామ్ బ్లైండ్...

- కళ్లు లేని శునకం మెడలో రేడియం బోర్డు, బెల్టు
- రక్షణ కోసం ఓ జంతు ప్రేమికుడి ఐడియా




భద్రాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఇదో వీధి కుక్క. దీనికి కళ్లు కనిపించకపోవడంతో శబ్ధం, వాసన చూసుకుంటూ వీధుల్లో సంచరిస్తోంది. దీంతో పలువురు తమను కరిచేందుకు వస్తుందనుకొని కొట్టడంతో భయపడుతూ సంచరిస్తోంది. విషయం తెలుసుకున్న జంతు ప్రేమికుడు ఎలిపే ఉదయ్‌కుమార్ కుక్కను చేరదీసి తన ఇంటికి తీసుకెళ్లి వైద్య సేవలందించినా కళ్లు రాలేదు. కాగా ఇటీవల ఆ శునకం భద్రాచలం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో మళ్లీ కనిపించడంతో కుమార్ గొంతును గుర్తించి ఆయన దగ్గరకు వచ్చింది. కుమార్ దాని మెడలో 'నాకు కళ్లు కనపడవు' అనే బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే మెడ చుట్టూ రేడియం స్టిక్కర్లతో బెల్టును ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాలు జరగకుండా నివారించడమే కాకుండా శునకానికి కళ్లు లేవనే విషయం తెలుస్తుందనే ఉద్దేశ్యంతో ఈ విధంగా చేసినట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కుమార్ వీధి శునకాలకు వైద్యసేవలందించడం, ఆహారం పెట్టడం లాంటి సేవలందిస్తుంటారు. అదేవిధంగా వీధి శునకాలకు రహదారి ప్రమాదాలను నివారించేందుకు మెడలో రేడియం స్టిక్కర్లతో ఉన్న బెల్టును ఏర్పాటు చేస్తున్నారు.

# నెరవేరిన కల




## ఉమ్మడి జిల్లాలో మరో రెండు కొత్త మునిసిపాలిటీలు

- అశ్వారావుపేట, ఏదులాపురం పట్టణాలకు గ్రీన్‌సిగ్నల్
- అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం
- ఏదులాపురంలో 58,647 జనాభా.. 43,974 ఓటర్లు...
- అశ్వారావుపేటలో 32,766 జనాభా... 18,709 ఓటర్లు...
- ఫలించిన మంత్రి పొంగులేటి కృషి
- హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ఉమ్మడి జిల్లాలో మరో రెండు కొత్త మునిసిపాలిటీలు ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో మార్గం సుగమమైంది. అధికారిక ఉత్తర్వులు జారీచేయడమే మిగిలి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రం మునిసిపాలిటీగా ఏర్పాటుకానుంది. ఏపీ నుంచి వస్తుండగా తెలంగాణ ముఖద్వారంగా పేరుపొందిన ఈ పట్టణం ఎన్నో ప్రత్యేకతల సమ్మిళితం. పరిశ్రమలు, పరిశోధన, విద్యా సంస్థలు, పామాయిల్ తోటలు ఇలా ఎన్నింటితోనో తనదైన అస్తిత్వాన్ని కలిగివుంది. ఇక్కడ పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలను కలపడం ద్వారా అశ్వారావుపేట మునిసిపాలిటీని ఏర్పాటుచేయనున్నారు. 32,766 మంది జనాభా... 18,709 మంది ఓటర్లతో ఈ మునిసిపాలిటీ కొలువుదీరనుంది. ఇక ఖమ్మం జిల్లా కేంద్రం సమీపంలోని ఏదులాపురం కేంద్రంగా మరో మునిసిపాలిటీ ఏర్పాటుకానుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గ పరిధిలో ఈ పట్టణం ఉంది. ఏదులాపురం చుట్టుపక్కల గల 12 గ్రామ పంచాయతీలను కలపడం ద్వారా ఈ మునిసిపాలిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ 58,647 మంది జనాభా, 43,974 ఓటర్లు ఉన్నారు. రెండు పట్టణాలకు మునిసిపాలిటీ హోదాతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని భావిస్తున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 7 మునిసిపాలిటీలు ఉండగా, ఈ సంఖ్య 9కి పెరగనుంది.

## ఏదులాపురం కేంద్రంగా...

**12 గ్రామ పంచాయతీలతో మునిసిపాలిటీ ఏర్పాటు**

ఖమ్మం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రం సమీపంలోని ఏదులాపురం కేంద్రంగా నూతన మునిసిపాలిటీ ఏర్పాటుకానుంది. ఏదులాపురం చుట్టుపక్కల గల 12 గ్రామ పంచాయతీలను కలపడం ద్వారా మునిసిపాలిటీ అవతరించనుంది. శుక్రవారం అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏదులాపురం మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలని ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. దీంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరినట్లయింది.

ఖమ్మం రూరల్ మండలం... మొత్తం 30 గ్రామ పంచాయతీలతో జిల్లాలో అతిపెద్ద మండలంగా ఉండేది. ఈ మండల వ్యాప్తంగా జనాభా లక్షకు పైగా ఉంది. ఖమ్మం జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ప్రధాన గ్రామాలు పెద్దతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల, పోలేపల్లి గ్రామాల్లో కాలనీలు అభివృద్ధి చెంది ఉన్నాయి. దీంతో ఈ గ్రామాలతో మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. వాస్తవానికి ఈ గ్రామాలను 2018లోనే ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. అయితే ప్రజల ఆందోళనల దృష్ట్యా వాటిని మళ్లీ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. కానీ నేటివరకు ఆ గ్రామాల్లో ఎన్నికలు మాత్రం నిర్వహించలేదు. ఇప్పుడు ప్రభుత్వం (మిగతా 4వ పేజీలో)

## అశ్వారావుపేటకు మహర్దశ

- రెండు పంచాయతీల విలీనంతో మునిసిపాలిటీ ఏర్పాటు



అశ్వారావుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల కల సాకారమైంది. మేజర్ పంచాయతీగా ఉన్న అశ్వారావుపేట ఎట్టకేలకు మునిసిపాలిటీ హోదాను సంతరించుకుంది. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబు గురువారం అసెంబ్లీలో ప్రకటించడంతో అశ్వారావుపేటలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మునిసిపాలిటీపై త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అవుతాయని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో భౌగోళికంగా కలిసి ఉన్న పేరాయిగూడెం పంచాయతీ, గుర్రాలచెరువు పంచాయతీలను విలీనం చేయడం ద్వారా మునిసిపాలిటీ ఏర్పాటు చేయనున్నారు. అశ్వారావుపేట గతంలో సమితి కేంద్రం(బ్లాక్)గా ఉంది. ఆంధ్ర నుంచి వస్తుంటే అశ్వారావుపేట తెలంగాణ ముఖద్వారంగా ఉంటుంది. ఈ పట్టణం ప్రస్తుతం మునిసిపాలిటీ కావడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పాటుకావడంతో పట్టణవాసుల (మిగతా 4వ పేజీలో)

**ఉమ్మడి జిల్లాలో...**
మునిసిపల్ కార్పొరేషన్ : ఖమ్మం
మునిసిపాలిటీలు :సత్తుపల్లి, మధిర, వైరా, (ఏదులాపురం)
కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ,మణుగూరు, (అశ్వారావుపేట)

## హలో.. ఎస్ఈ!

**విద్యుత్ సమస్యలపై నేడు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్**



విద్యుత్ సరఫరాలో అంతరాయాలు... కరెంట్ తీగలు తెగిపోయి ప్రమాదాలు... ప్రమాద భరితంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు... రోడ్లపైనే విద్యుత్ స్తంభాలు, పలుచోట్ల లోవోల్టేజీలు, ట్రాన్స్‌ఫారాల సమస్యలు.. ఇలా ఎన్నింటితోనే విద్యుత్ వినియోగదారులు సతమతమవుతున్నారు. అలాగే అర్హత ఉన్న వారికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకం అందడం లేదు. విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ కె.సురేందర్‌తో 'ఆంధ్రజ్యోతి' శనివారం 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. విద్యుత్ వినియోగదారులు ఎన్పీడీసీఎల్ ఎస్ఈతో నేరుగా మాట్లాడటం ద్వారా తమ సమస్యలను, సందేహాలను పరిష్కరించుకోవచ్చు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

ఫోన్ ఇన్ తేది
21-12-2024 (శనివారం)
సెల్ నెంబరు
99854 11613
కాల్ చేయాల్సిన సమయం
ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

## కేటీఆర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చించాలి
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

ఖమ్మం టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చించాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేయాలన్నారు. జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, బాణోత్ చంద్రావతి మాట్లాడుతూ ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో నిబంధనల ప్రకారం చర్చించాలని, అందుకు తాను సిద్ధమని కేటీఆర్ ప్రకటించినా, ప్రభుత్వం పట్టించుకోకుండా అక్రమకేసులు బనాయించిందని తెలిపారు. హైదరాబాద్‌లో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ (మిగతా 4వ పేజీలో)

## 'భూ భారతి'పైనే ఏజెన్సీ రైతుల ఆశలు

- 1/70 చట్టంతో భూములకు దక్కని యాజమాన్య హక్కులు
- వారసత్వ భూములదీ అదే పరిస్థితి
- కొత్త చట్టంలోని అంశాలతో తమ కష్టాలు తీరాలని ఆకాంక్ష
- భద్రాద్రి జిల్లాలో 80శాతం ఏజెన్సీ ప్రాంతమే
- ఆంక్షలు, నిబంధనలతో వలస వెళ్లుతున్న రైతులు




కొత్తగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'ధరణి' స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో నూతనంగా ఆమోదించిన భూభారతి-2024 ఆర్‌వోఆర్ చట్టం ఏజెన్సీ ప్రాంత ప్రజల్లో ఎన్నో ఆశలను రేకెత్తిస్తోంది. ఏజెన్సీలో 1/70 యాక్టు మూలంగా భూములకు పట్టాలు కాకుండా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు, రైతుభరోసా, రైతుల రుణమాఫీ అందడం లేదు. అలాగే బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం పొందలేకపోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23మండలాల్లో 80శాతం 1/70 చట్టం అమలులో ఉన్నందున పూర్తిగా క్రయ, విక్రయాలు జరగడం లేదు. తద్వారా వ్యవసాయ భూములకు విలువ పెరగడం లేదు. రిజిస్ట్రేషన్ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం లభించడం లేదు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1/70 యాక్టు అమలులో ఉండటం వల్ల గిరిజన, గిరిజనేతర రైతాంగం మధ్య భూముల కొనుగోళ్లు, అమ్మకాలు నిషేధించబడ్డాయి. గతంలో కొనుగోలు చేసినటువంటి భూములకు సాదాబైనామాలు రాసుకున్నప్పటికీ పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పటి వరకు లభించలేదు. చట్టపరంగా భూములపై హక్కు లేకపోవడం వల్ల కుటుంబంలో ఉన్న వారసులు కూడా భూముల హక్కుపత్రాలను పొందలేకపోతున్నారు.

ఇటీవల కాలంలో వారసత్వ హక్కు పట్టాదారు పాస్ పుస్తకం కూడా లభించడం లేదని రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఆర్‌వోఆర్ చట్టం ద్వారా పట్టాలు ఉన్న భూములను గిరిజనేతరులు గిరిజనేతర రైతాంగానికి అమ్ముకున్నప్పటికీ, సాదా బైనామాపత్రాలు రాసుకున్నప్పటికీ ఆ భూములకు హక్కుపత్రాలు ఇప్పటి వరకు పొందలేకపోయారు. చాలామంది రైతాంగం ఆ భూములపై యాజమాన్య హక్కులేకపోవడం వల్ల ఏజెన్సీ పరిధిలో భూముల కొనుగోలు, అమ్మకాలు జరగడం లేదు. భూముల విలువలు పెరగకపోవడం వాటికి హక్కుపత్రాలు లేకపోవడం, రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ఈ ప్రాంతవాసులు 1/70యాక్టు లేని ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసుకుని అక్కడే స్థిర (మిగతా 4వ పేజీలో)




ఇల్లెందు సభలో ప్రసంగిస్తున్న తమ్మినేని

## హామీలు పూర్తిగా అమలు చేయాలి

- లేకుంటే ప్రజలు క్షమించరు
- ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్ జిమ్మిక్కులు
- బీజేపీ చర్యలు దేశ సమగ్రతకు ముప్పు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఇల్లెందులో భద్రాద్రి జిల్లా మూడో మహాసభలు

ఇల్లెందు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ నియంతృత్వ పోకడలు హెచ్చుమీరడం, కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీలతో ప్రజలకు మేలు కలుగుతుందని భావించి మద్దతునిస్తే సీఎం రేవంత్ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. శుక్రవారం ఇల్లెందులో సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం మూడో మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

నిండు పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇండియా కూటమి పక్షాలు భారత్‌బంద్‌కు, రాష్ట్రంలో బంద్‌కు కాంగ్రెస్ ఇతర కూటమి పక్షాలు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ పాలకులు దేశంలో రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని, అంబేద్కర్ (మిగతా 4వ పేజీలో)

### తల్లీబిడ్డలకు ప్రాణం పోసిన

# భద్రాద్రి వైద్యులు

**ఏరియా వైద్యశాల వైద్యులను అభినందించిన కలెక్టర్**


చికిత్స పొందుతున్న తల్లి



భద్రాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసవ వేదనతో భద్రాచలం ఏరియా వైద్యశాలకు వైద్యం కోసం వచ్చిన గర్భిణి అపస్మారక స్థితికి చేరడం, ఇదే సమయంలో ప్రాణపాయ స్థితిలో పుట్టిన శిశువుకు భద్రాచలం ఏరియా వైద్యశాల వైద్యులు ప్రాణం పోశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చర్ల మండలం రాళ్లపురం గ్రామానికి చెందిన 39ఏళ్ల కుంజం మయ్యమ్మ అనే గిరిజన మహిళ ప్రసవం కోసం రాగా ఆమె తీవ్ర అనారోగ్య సమస్యలతో ఉంది. వైద్య చికిత్స అందించే సమయంలో తొమ్మిదిసార్లు మూర్ఛ రావడం, అధిక రక్తపోటుతో స్పృహ కోల్పోయింది. దీంతో ఆపరేషన్ చేసి ప్రసవం చేశారు. పుట్టిన శిశువు సైతం ప్రాణపాయస్థితిలో ఉండటంతో తల్లీబిడ్డలకు వైద్యులు ప్రత్యేక వైద్య సేవలందించి ఇద్దరిని ప్రాణపాయం నుంచి కాపాడారు. తల్లి మయ్యమ్మను వెంటిలేటర్‌పై ఉంచి వారంపాటు చికిత్స అందించగా ప్రస్తుతం కోలుకుంది. శిశువు ఆరోగ్యం సైతం ప్రస్తుతం మెరుగ్గానే ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

**వైద్యులను అభినందించిన జిల్లా కలెక్టర్**

భద్రాచలం ఏరియా వైద్యశాలలో తల్లీబిడ్డలకు ప్రాణం పోసిన వైద్యులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ప్రమీల, డాక్టర్ సాత్విక, డాక్టర్ నిఖిత, డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయరావులతోపాటు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణలను కలెక్టర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ఏజెన్సీ ప్రాంతంలో మరింత మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# ఐడియా అదిరింది.. పంట పండింది..


జీవామృతం తయారీ కోసం ఏర్పాటు చేసిన ప్లాంటు

- ప్రకృతి సేద్యంలో దూసుకుపోతున్న యువకుడు
- జీవామృతంతో బంగారం పండిస్తున్న ఘటికుడు
- దేశవాళీ రకాలతో స్వయంగా విత్తనోత్పత్తి
- ధాన్యంతో పాటు మిర్చి, కంది, మొక్కజొన్న సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న చల్లా నాగేశ్వరరావు

ముదిగొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యావంతుడు కావడంతో కల్తీలేని ఆహారాన్ని అందించాలనుకున్నాడు.. రసాయనాల పిచికారితో విసిగిపోయాడు.. సేంద్రియ సాగుతో పైరుకు బలం పెంచాలనకున్నాడు.. విషం లేని పంటల కోసం జీవామృతాన్ని తోడు తెచ్చుకున్నాడు.. తక్కువ పెట్టుబడితో బంగారం పండిస్తున్నాడు. ప్రకృతి వ్యవసాయంలో అద్భుతాలు సృష్టిస్తున్నాడు తక్కువ వ్యయంతో ఎక్కువ దిగుబడులు సాధిస్తూ ఆరోగ్యానికి హానికరం కాని పంటలను పండిస్తున్నాడు యువరైతు చల్లా నాగేశ్వరరావు.

**28ఎకరాల్లో పలు పంటల సాగు...**

ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామానికి చెందిన చల్లా నాగేశ్వరరావు ఉన్నత విద్య(ఎంఎస్సీ, పీహెచ్‌డీ)అభ్యసించాడు. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తనకున్న ఎనిమిది ఎకరాల భూమితోపాటు మరో 20ఎకరాలు కౌలుకు తీసుకొని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాడు. ఎనిమిదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. 18ఎకరాల్లో వరి, ఎకరంన్నరలో మిర్చి, ఎకరంన్నరలో అరటి, మూడెకరాల్లో కంది, ఎకరంన్నరలో మొక్కజొన్న పంటలను సాగుచేస్తున్నాడు. మహబూబ్‌నగర్ నుంచి దేశీవాళీ విత్తనాలను తీసుకువచ్చి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాడు. కొత్తగా విత్తనాలు కొనకుండా తాను పండించిన పంటలోనే స్వయంగా విత్తనోత్పత్తి చేస్తున్నాడు.

**జీవామృతం తయారీ...**

రూ.2.40లక్షల ఖర్చుతో జీవామృతం తయారీకి పరికరాలను ఏర్పాటుచేసుకొని 50 కిలోల పండ్లు, 50 కిలోల కూరగాయలు, 40లీటర్ల గోవు మూత్రం, రెండు కిలోల పెరుగు, రెండు కిలోల బియ్యం, 30 కిలోల ఆవుపేడ, 35లీటర్ల గంజితో 30రోజుల్లో వెయ్యి లీటర్ల జీవామృతాన్ని తయారుచేసుకొని పంటలను సాగుచేస్తున్నాడు. ప్రతిసారి వెయ్యిలీటర్ల జీవామృతాన్ని తయారుచేసేందుకు రూ.పదివేల ఖర్చు వస్తుందని, దీంతో ఈ జీవామృతం 20ఎకరాలకు సరిపోతుందని రైతు తెలిపాడు. ఇదే జీవామృతంతో ఒక ఎకరాకు 20లీటర్ల మజ్జిగ, 20లీటర్ల ఆవు మూత్రం ఉపయోగించి పంటపై పిచికారి చేస్తున్నట్లు తెలిపాడు. ఈ జీవామృతం తయారీతోపాటుగా బయోగ్యాస్ రోజుకు రెండు కేజీల వరకు తయారవుతున్నాడు. రైతు తయారు చేసిన జీవామృతం ఒక్కసారిగా బావిలోకి వదిలి పంటలకు నీరందించటం ద్వారా భూసారం పెరిగి ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా వ్యవసాయాన్ని చేస్తున్నట్లు రైతు వివరించాడు.


జీవామృతం తయారు చేస్తున్న నాగేశ్వరరావు

**ప్రకృతి సేద్యం లాభదాయకంగా ఉంది**

**చల్లా నాగేశ్వరరావు, యువరైతు, పెద్దమండ**



ఎనిమిదేళ్లుగా ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తున్నాను. ఒక ఎకరం వరికి 22బస్తాల దిగుబడి వస్తుంది. పంట అమ్మగా రూ.77వేలు రాగా, దానిలో 40వేలు లాభం మిగులుతుంది. పండించిన బియ్యాన్ని క్వింటా రూ.ఏడువేల చొప్పున సొంతంగా విక్రయిస్తున్నా. మిర్చి, కంది, మొక్కజొన్న పంటలకు కూడా పెట్టుబడి తక్కువతో లాభాలు వస్తున్నాయి. చదువుకున్న ప్రతి ఒక్కరూ విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లకుండా ఇక్కడే వ్యవసాయం చేసుకొని ఎక్కువగా సంపాదించుకోవచ్చు.

# ఎట్టకేలకు ఏకతాటిపైకి...

- విలీనానికి రెండు న్యూడెమోక్రసీ విప్లవ పార్టీల నిర్ణయం
- 28న హైదరాబాద్‌లో విలీన సభ
- ముందే వెల్లడించిన 'ఆంధ్రజ్యోతి'

ఇల్లెందు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమాల నిర్మాణం, విప్లవకారుల ఐక్యత ప్రజల ఆకాంక్షల మేరకు రెండు న్యూడెమోక్రసీ పార్టీలు విలీనమవుతున్నట్లు శుక్రవారం సంయుక్తంగా ప్రకటించాయి. నవంబరు 30న 'ఆంధ్రజ్యోతి'లో 'విలీనం దిశగా ఎన్‌డీ విప్లవ పార్టీలు' కొనసాగుతున్న రెండు పార్టీల ఐక్యతాచర్చలు శీర్షికలతో ప్రచురితమైన వార్తాకథనం అక్షరసత్యమైంది. శుక్రవారం ఈ మేరకు యతేంద్రకుమార్ నాయకత్వంలోని ఎన్‌డీ పార్టీ, సాధినేని వెంకటేశ్వరరావు నాయకత్వంలోని మరో ఎన్‌డీ పార్టీల అగ్రనాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, వేములపల్లి వెంకట్రామయ్య, జేవీ.చలపతిరావు, కే.గోవర్ధన్‌లు సంయుక్తంగా తమ నిర్ణయాన్ని వెల్లడిస్తూ ప్రకటన చేశారు. 1969లో మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానంతో ఏర్పడిన సీపీఐ (ఎంఎల్) సాగిస్తున్న పోరాటాల్లో అనేక నిర్బంధాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, చిత్రహింసలకు పార్టీ నేతలు గురయ్యారని, అమరుల లక్ష్య సాధన కోసం విప్లవసంస్థలు ఐక్యం కావాల్సిన అవసరాన్ని గుర్తించామన్నారు. ఎన్నో ఏళ్లుగా విప్లవ ప్రజానీకం ఎదురుచూస్తున్న విధంగా సైద్ధాంతికంగా, రాజకీయపరంగా భావసారూప్యం కలిగిన రెండు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ విప్లవ పార్టీలు గత 8నెలలుగా చర్చలు జరుపుతూ విలీనం కావాలని నిర్ణయించామని తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు పార్టీల ఐక్యతా విలీనసభ జరుగుతుందని సభలో కేంద్రకమిటీ నాయకులు దర్శన్‌సింగ్ కట్కర్, సాధినేని వెంకటేశ్వరరావు, వేములపల్లి వెంకట్రామయ్య జేవీ.చలపతిరావు, పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కే.గోవర్ధన్, వి.సంధ్య, జి.ఝాన్సీ ప్రసంగిస్తారని వెల్లడించారు. విలీన నిర్ణయాన్ని రెండు పార్టీల అగ్రనాయకులు ప్రకటించడంతో ఆ పార్టీలశ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. చీలికలతో కూనారిల్లుత నీరసిస్తున్న రెండు పార్టీల క్యాడర్‌లో నాయకుల్లో నూనోత్తేజం నెలకొంది.

### కలెక్టర్లతో నీతి అయోగ్ సీఈవో

# వీడియో కాన్ఫరెన్స్

కొత్తగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం (ఏడీపీ)కి ఎంపికైన జిల్లాల కలెక్టర్లతో నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జూలై 1నుంచి సెప్టెంబరు 30వరకు జరిగిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమాలను అన్ని ఆకాంక్షిత జిల్లాలు, మండలాలు విజయవంతంగా పూర్తి చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో ఇచ్చినటువంటి లక్ష్యాలను సంపూర్ణంగా సాధించగలిగామని తెలిపారు. ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలోపు పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆకాంక్షిత జిల్లాల, మండలాల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఆకాంక్షిత మండలమైన గుండాలలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికలు సమర్పించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సీపీవో సంజీవరావు, యాస్పిరేషన్ బ్లాగ్‌ప్రోగ్రాం ఫెలో నవనీత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుది దశకు సీఎం కప్ క్రీడా పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు తుది దశకు చేరున్నాయి. శుక్రవారం జిల్లాలోని 21 మండలాల నుంచి సుమారు 448మంది క్రీడాకారులు హాజరైనారు. పోటీల్లో భాగంగా క్రీడాకారులకు ఖో-ఖో(మెన్), హ్యాండ్‌బాల్(మెన్), సైక్లింగ్, పవర్‌లిఫ్టింగ్(మెన్) విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పోటీలను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు షఫీ, సాంబమూర్తి, ఆదర్శ్‌కుమార్, కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ, నగేష్, రామ్‌రాయల, కైలాష్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.


ఖో-ఖో పోటీలో



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

**మూడో రోజు విజేతలు వీరే;**

- సైక్లింగ్ బాలుర విభాగంలో సత్యనారాయణ ప్రథమ, యువాన్ ద్వితీయ, సాయిక్రిష్ణ తృతీయ, అరవింద్ నాల్గవ, అహిల్‌యాసిన్ ఐదవ స్థానాల్లో నిలిచారు.
- హ్యాండ్‌బాల్ బాలుర విభాగంలో ఖమ్మం అర్బన్ జట్టు ప్రథమ, దమ్మపేట జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.
- ఖో-ఖో బాలికల విభాగంలో ఖమ్మం కార్పొరేషన్ జట్టు ప్రథమ, మధిర జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

# అశ్వారావుపేటకు మహర్దశ

(3వ పేజీ తరువాయి)

చిరకాలవాంఛ తీరనుంది. అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలను కలిపి మునిసిపాలిటీగా ఏర్పాటుచేసేందుకు అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో ప్రస్తుతం 22,836 జనాభా ఉంది. ఆదాయం రూ.8.38 కోట్లు, వ్యయం రూ.7.17 కోట్లు. పేరాయిగూడెం పంచాయతీలో 8,682 జనాభా, రూ.3.10 కోట్లు ఆదాయం, వ్యయం రూ.2.82 కోట్లు ఉండగా, గుర్రాల చెరువు పంచాయతీలో 1,248 జనాభా, రూ.58 లక్షల ఆదాయం, రూ.53 లక్షల వ్యయం ఉంది. వెరసి మూడు పంచాయతీల్లో కలసి 32,766 మంది జనాభా, రూ.12.06 కోట్లు ఆదాయం, రూ.10.52 కోట్లు వ్యయం కలిగి ఉంది. 38 వార్డులు, 18,709 ఓటర్లతో మునిసిపాలిటీ ఏర్పడనుంది.

ఇక పారిశ్రామికంగా కూడా అశ్వారావుపేట ప్రాధాన్యత సంతరించుకుంది. 1980వ దశకం నుంచే అశ్వారావుపేట కెమిలాయిడ్స్ ప్రైవేట్ లిమిటేడ్, పేపరుబోర్డు, వ్యవసాయ కళాశాల, ఉద్యాన పరిశోధన కేంద్రాలు, కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం, అటవీపరిశోధన కేంద్రం, సెరికల్చర్ నర్సరీ, పామాయిల్ ఫ్యాక్టరీ, పెద్ద సంఖ్యలో నర్సరీలు ఉన్నాయి. 2009 నియోజవర్గాల పునర్విభజనలో భాగంగా అశ్వారావుపేట కేంద్రంగా నియోజకవర్గం ఏర్పడింది. ఈ ప్రాంతం పూర్తిగా తెలంగాణ, ఆంధ్ర సంస్కృతి, సంప్రదాయాలతో మిళితమై ఉంటుంది.

**మారనున్న రూపురేఖలు**

మునిసిపాలిటీగా రూపాంతరం చెందడంతో అశ్వారావుపేట పట్టణ రూపురేఖలు, రాజకీయ సమీకరణలు మారి పోనున్నాయి. కొన్నేళ్లుగా మునిసిపాలిటీగా ఏర్పడుతుందనే చర్చలు వస్తుండటంతో ఛైర్మన్, కౌన్సిలర్ పదవులకు పోటీ చేయడానికి అనేక మంది ఆశావహులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మునిసిపాలిటీ ఏర్పాటుతో పట్టణ అభివృద్ధి వేగంగా జరుగుతుందని పలువురు ప్రముఖులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

**హామీ నిలబెట్టుకున్నాం...**

అశ్వారావుపేటను మునిసిపాలిటీగా ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు.

అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలను కలపి అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పాటు చేయడానికి అసెంబ్లీ ఆమోదం లభించిందని, త్వరలోనే జీవో కూడా జారీ కానుందన్నారు.

# ఏదులాపురం కేంద్రంగా...

(3వ పేజీ తరువాయి)

సదరు విలీన పంచాయతీలతో పాటు మరో ఆరు గ్రామ పంచాయతీలను కలిపి నూతన మునిసిపాలిటీ ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసింది.

**12 గ్రామ పంచాయతీలతో..**

మొత్తం 12 గ్రామ పంచాయతీలతో కలిపి ఏదులాపురం మునిసిపాలిటీ ఏర్పాటు చేయనున్నారు. ఏదులాపురం, పెద్దతండా, బారుగుడెం, చిన్నవెంకటగిరి, గొల్లగూడెం, గుదిమళ్ల, గుర్రాలపాడు, మద్దులపల్లి, ముత్తగూడెం, తెల్దారుపల్లి, పల్లెగూడెం పరిధిలోని రెడ్డిపల్లి, పోలేపల్లి పంచాయతీలోని భద్రాద్రి నగర్‌కాలనీ, సాయినగర్ కాలనీ, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, వికలాంగుల కాలనీ, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాలను కలపనున్నారు. ఈ గ్రామాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 38,210 మంది జనాభా ఉండగా, ప్రస్తుతం 58,647 మంది ఉన్నారు. ఓటర్లు 43,974 ఉన్నట్లు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ చేయాలని గతంలో ఈ ప్రాంత ప్రజలు మంత్రి పొంగులేటిని కలిసి వినతులు ఇచ్చారు. ప్రజల కోరిక మేరకు మున్సిపాలిటి చేయాలని ప్రతిపాధనలు పంపించాలని అధికారులను గతంలో ఆదేశించడం జరిగింది.. ఎట్టకేలకు మంత్రి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడంతో ప్రజల కల నెరవేరింది. కొత్త మునిసిపాలిటీతో 12 పంచాయతీల్లో అభివృద్ధి మరింత వేగం పుంజుకోనుంది.

### 'భూ భారతి'పైనే

# ఏజెన్సీ రైతుల ఆశలు

(3వ పేజీ తరువాయి)

నివాసం ఏర్పాటు చేసుకుని ఆ భూముల్లో పంటలు పండించుకుంటూ జీవిస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల జిల్లాలో వ్యవసాయరంగం కూడా కొంత వెనుకబడిపోయింది.

గతంలో ఆర్‌వోఆర్ యాక్టు ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు వారి భూములను గిరిజనేతరులకు అమ్ముకోలేకపోతున్నారు. ఏజెన్సీలోని 1/70 యాక్టు ప్రకారంగా గిరిజనులు కొనుగోలుచేసిన భూములకే పట్టాదారు పాస్ పుస్తకాలు, భూయాజమాన్య హక్కుపత్రాలు లభిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ధరణి వ్యవస్థను ప్రక్షాళన చేసి ఆ స్థానంలో భూభారతి చట్టం తీసుకురావడం వల్ల తమ భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు ఆశిస్తున్నారు.

గ్రామకంఠం, అసైన్డ్‌భూములు, ఆబాదిలకు కూడా హక్కుల రికార్డును కల్పిస్తామని చట్టంలో పొందుపరిచింది. డిజిటల్ ల్యాండ్ రికార్డుల సవరణ, పార్ట్‌-బీ కేసులపై నిర్ణయానికి అవకాశాలు కల్పించాయి. గతంలో పట్టాదారుని పక్కన అనుభవదారుడిగా వచ్చిన రైతులకు భూముల పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేసేందుకు ప్రభుత్వం చట్టంలో పొందుపర్చడంతో ఈ ప్రాంత రైతాంగం కాస్త ఊపిరి పీల్చుకుంటుంది. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాల క్రమబద్దీకరణ జరుపుతామని తెలియచేయడంతో రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామానికి ఓ రెవెన్యూ అధికారితో అందుబాటులోకి రెవెన్యూ సేవలు తీసుకు వస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి మనిషికి ఆధార్ లాగా భూకమతానికి ప్రత్యేక సంఖ్యతో కూడిన భూధార్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పేద రైతులకు జిల్లా స్థాయిలో రెండు అంచుల అప్పీల వ్యవస్థ ప్రత్యేక భూ పరిపాలన, ట్రిబ్యూనల్ ద్వారా ఉచిత న్యాయ సహాయం కూడా అందించనున్నారు. మొత్తం మీద ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి గతంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందలేనటువంటి రైతాంగానికి ఈ భూభారతి చట్టం ప్రకారంగా ఆర్‌వోఆర్ చట్టం ఈ ప్రాంత రైతులకు కాస్త చుట్టంలా మారే అవకాశాలు లేకపోలేదు. జిల్లాలో ప్రధానంగా కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని ఏజెన్సీ మండలాల్లోని పలు గ్రామాల్లో 1/70 యాక్టు అమలులో ఉంది. ఈ చట్టానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ జిల్లాలో పంటలు పండించే రైతాంగానికి భూమిపై యాజమాన్యపు హక్కు పొందేందుకు భూభారతి చట్టం వర్తించే అవకాశాలు ఉన్నాయని ఆశిస్తున్నారు.

### కేటీఆర్‌పై

# అక్రమ కేసులు ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

(3వ పేజీ తరువాయి)

నిర్వహణ వల్ల రూ.700 కోట్లు ఆదాయం వచ్చిందని, ప్రతిష్టాత్మకమైన ఈ క్రీడ వల్ల హైదరాబాద్‌కు ఎంతో ప్రతిష్ట రావటమే కాకుండా, విదేశీకంపెనీల ద్వారా పెట్టుబడులు వచ్చే అవకాశం కలిగిందన్నారు. నిధులు ఇతర చోట్లకు మళ్లించినా, వ్యక్తిగత ఖాతాలకు బదిలీ చేసుకున్నా నేరమని, కేటీఆర్ ఐటీమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వరంగ బ్యాంక్ ద్వారానే రేసింగ్ కంపెనీకి నిధులు జమచేశారని, అది నేరం ఎలా అవుతుందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఎన్నో ముఖ్యమైన అంశాలను చర్చించవలసిన అసెంబ్లీలో కేవలం కేటీఆర్ అరెస్ట్‌పై చర్చించటం సిగ్గు చేటన్నారు. విలేకరుల సమావేశంలో జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, నాయకులు గుండాల కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, బిచ్చాల తిరుమలరావు, బెల్లం వేణు, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### హామీలు పూర్తిగా

# అమలు చేయాలి

(3వ పేజీ తరువాయి)

రాజ్యాంగాన్ని కాదని మనువాద రాజ్యాంగం అమలుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదాని పెట్టుబడులతో ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు రూ.1750 కోట్ల లంచాలు ముట్టినట్లు అమెరికాలో కేసు నమోదైందని తెలంగాణలో అదానీతో జరిగిన ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జమిలి ఎన్నికలు దేశానికి తీవ్ర ముప్పు తెస్తాయని ప్రతిపక్షాల నిర్మూలనకే మోదీ ప్రభుత్వం కుంటి సాకులతో కుట్ర చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం మినహా ఏ ఒక్క హామీ సంపూర్ణంగా అమలు కాలేదన్నారు. గతంలో కేసీఆర్ చేసిన అప్పులు తెలిసి కూడా ఎన్నికల్లో ఎలా హామీలు ఇచ్చారని, ఏడాది పాలనలో రేవంత్ ప్రభుత్వం కూడా రూ.1.20 లక్షల కోట్లు అప్పులు తెచ్చిందని ధ్వజమెత్తారు.

**కదం తొక్కిన ఎర్రదండు**

సీపీఎం మూడో జిల్లా మహాసభల సందర్భంగా ఇల్లందు పట్టణంలో పార్టీ శ్రేణులు ప్రదర్శన నిర్వహించాయి. అరుణ పతాకాలు చేబూని రెడ్‌షర్టు వాలంటీర్లు ఎర్ర చీరలు ధరించిన మహిళలు పాత బస్టాండు సెంటరు నుంచి గోవింద్ సెంటరు మీదుగా సభా ప్రాంగణమైన సింగరేణి కమ్యూనిటీ హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, పోతినేని సుదర్శన్, బి.వెంకట్, ఏజే రమేష్, మచ్చా వెంకటేశ్వర్లు, ఎస్‌ఏ నబీ, ఆలేటి కిరణ్, కాసాని అయిలయ్య పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి..

- ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు
- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రోడ్డు భద్రతా చర్యలపై అధికారులతో సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పక్కా ప్రణాళికతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రోడ్డుభద్రతా చర్యలపై అధికారులతో కలెక్టర్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సైన్, స్పీడ్ లిమిట్ బోర్డుల ఏర్పాటు, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్లపై జరిగే ప్రమాదాల నియంత్రణకు అంకిత భావంతో పని చేయాలన్నారు. రోడ్లపై ప్రమాదాలకు రోడ్లు బాగా లేకపోవడం, వాహనదారులు నియమాలను అతిక్రమిస్తూ వాహనాలు నడపడం, వీటి నివారణకు ఏలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళికలు తయారు చేసి వాటి అమలును పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ఉన్న స్కూల్ జోన్ ఏరియాలను ట్రాక్ చేయాలని, అక్కడ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించాలన్నారు రోడ్డు సేఫ్టీ ప్రమాణాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని అన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం, మరమ్మత్తు పనులు సహేతుకంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునిల్‌దత్

జాతీయరహదారుల్లో ఎక్కడ స్పీడ్ లిమిట్ బోర్డులు కనపడటం లేదని, వీటిని వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న రోడ్డు లకు సంబంధించి సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అన్నారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పోలీస్ అధికారులు, ఇతర అధికారులు పరిశీలించాలని, అక్కడ ప్రమాదాలు జరిగే అవకాశాలను తగ్గించేందుకు కలిసి పని చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, జిల్లా రవాణా అధికారి వరప్రసాద్, పోలీస్, రవాణా అధికారులు పాల్గొన్నారు.

**త్వరలో భద్రాచలం-బీహెచ్‌ఈఎల్ సర్వీసుల పునరుద్ధరణ?**

భద్రాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి త్వరలో భద్రాచలం-బీహెచ్‌ఈఎల్ సర్వీసులను తిరిగి పునరుద్ధరించనున్నట్లు తెలుస్తోంది. గతంలో మూడు సర్వీసులు ఉండగా సుమారు మూడు నెలల క్రితం అధికారులు ఆ సర్వీసులను భద్రాచలం-ఎంజీబీఎస్‌కు కుదించారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సైతం స్థానిక ప్రయాణీకులకు ఎంతో ఉపయోగకరమైన ఈ సర్వీసులను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. ఇదే క్రమంలో సీపీఎం సైతం భద్రాచలం ఆర్టీసీ బస్టాండు ఎదుట రెండు రోజుల క్రితం ధర్నా నిర్వహించింది. ఈ నేపథ్యంలో భద్రాచలం నుంచి బీహెచ్‌ఈఎల్‌కు మూడు సర్వీసులను మళ్లీ పునరుద్ధరించాలనే యోచనలో అధికారులున్నారు.

## క్రైం సమాచారం

### హత్య కేసులో 15 మందికి జైలు

కొత్తగూడెం లీగల్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): 15మందికి జైలు శిక్ష విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా.. ప్రేమ వ్యవహారంలో జరిగిన గొడవలో 2017 జూన్13న దండు శ్రీను అనే వ్యక్తి తీవ్ర గాయాలతో మృతిచెందాడు. ఇల్లెందుకు చెందిన మహ్మద్ ముగ్దం అలీ అలియాస్ రషీద్ ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ బి. అశోక్ కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ఎ. నరేందర్ దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలుచేశారు. కోర్టులో 23మంది సాక్షుల విచారణ అనంతరం 15మందిపై నేరం రుజువైంది. ఇల్లెందుకు చెందిన షేక్ ఆరీఫ్, నేలమర్రి నాగరాజు, దేవరపల్లి జితేందర్ రెడ్డి, ఎలుగు సమంత్,పులిపాటి లోకేష్, తాళ్లపల్లి వంశీ, బండి శ్రీకాంత్, కాకరపల్లి ప్రేమ్‌కుమార్,ఎట్టి వెంకటేశ్వర్లు, దడిగల నరేష్, ఏడారి సంపత్, చింతలచెర్వు రఘు, కుండోజు రాజు, బోశాల ఉదయ్‌కుమార్, సూరపాక గౌతమ్‌లకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్క మనిషికి రూ. 2వేలు జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, లైజన్ ఆఫీసర్ ఎస్. వీరబాబు, (కోర్టు డ్యూటీ ఆఫీసర్) ఇల్లెందు పీఎస్ పీసీ శ్రీనివాస్ సహకరించారు.

### ఆటో ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కారేపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండలంలోని మధురానగర్‌తండా వద్ద శుక్రవారం జరిగిన ఆటో ప్రమాదంలో గుగులోత్ లక్ష్మి(60) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. కారేపల్లి ఎస్‌ఐ రాజారం కథనం ప్రకారం.. లక్ష్మి, ఆమె భర్త దేశ్యా కారేపల్లి వెళ్లి పెన్షన్ డబ్బులు తెచ్చుకునేందుకు బయలుదేరారు. మధురానగర్ తండా గ్రామ సెంటర్‌లో బొలేరో వాహనంలో పత్తిలోడు చేసుకుని బొక్కలతండా గ్రామానికి చెందిన వాంకుడోత్ సాయిరాం డ్రైవర్ వాహనాన్ని వెనక్కి తీసుకువస్తున్న సమయంలో లక్ష్మికి తగిడంతో ఆమె కింద పడింది. ఆమె పైనుంచి వాహనం వెళ్లడంతో లక్ష్మి అక్కడిక్కకడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ తన సిబ్బందితో ఘటనస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొణిజర్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శాంతినగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం శాంతినగర్‌కు చెందిన తాళ్లూరి సురేష్(39) రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి నుంచి విశాఖపట్నం వెళుతున్న కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రగాయాలతో మృతి చెందాడు. మృతదేహాన్ని ఖమ్మం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### 6 కిలోల గంజాయి పట్టివేత

పాల్వంచ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒరిస్సా నుంచి హైదరాబాదుకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పాల్వంచ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ముద్దమల్ల శేషుకు పాల్వంచకు చెందిన ప్రశాంత్‌తో పరిచయం ఏర్పడింది. వీరిరువురూ కలిసి ఒరిస్సా రాష్ట్రంలోని కలిమెలకు వెళ్లి అక్కడ 6 కిలోల700 గ్రాముల ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. గంజాయిని హైదరాబాదులో విక్రయిస్తే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని భావించి, అనుమానాం రాకుండా ద్విచక్రవాహనంపై గంజాయిని తరలించడానికి సిద్ధపడ్డారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి పాల్వంచ వైపు స్కూటీపై వస్తున్న శేషను పాల్వంచ పోలీసులు వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. ద్విచక్రవాహనంలో తనిఖీ చేయగా ఎండు గంజాయి బయటపడింది. దీంతో అతనిని పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంజాయిని రవాణా చేస్తున్న శేషు, సహకరించిన పాల్వంచ వాసి ప్రశాంత్ మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ. లక్షా యాభై వేలు ఉంటుందని తెలిపారు.

### ప్రధానోపాధ్యాయుడి హఠాన్మరణం



దమ్మపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గట్టుగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. ఫణి కుమార్ రెడ్డి(55) గురువారం రాత్రి హఠాన్మరణం చెందారు. అశ్వారావుపేట మండలం మామిళ్లవారిగూడెం పాఠశాలలో కిషోర్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ 5నెలల క్రితం గట్టుగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. సత్తుపల్లిలో నివాసం ఉంటున్న ఆయన గురువారం రాత్రి గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో వైద్యం కోసం ఖమ్మం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయన స్వగ్రామం వేంసూరు మండలం మర్లపాడు స్వగ్రామం కావటంతో మృతదేహాన్ని అక్కడకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### అర్చకుడి ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

భద్రాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామనగర్ కాలనీలో నివాసం ఉంటున్న వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు ఆరుట్ల నారాయణాచార్యులు ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపును రాడ్లతో పగలకొట్టి బీరువాలో ఉన్న సుమారు రూ.80 వేల నగదును చోరీ చేసినట్లు బాధితుడు నారాయణచార్యులు పేర్కొంటున్నారు. ధనుర్మాసం కావడంతో ఆలయ ప్రాంగణంలోనే అర్చకుడి కుటుంబ సభ్యులు ఉంటున్న క్రమంలో ఇంట్లో చోరీ జరిగింది. ఈ విషయం గమనించిన అర్చకుడు నారాయణాచార్యులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం వచ్చి సంఘటన స్థలంలో ఆధారాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భద్రాచలం సీఐ సంజీవరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్టు

భద్రాచలం, డిసెంబరు 20: భద్రాచలానికి సమీపంలోని జామాయిల్ తోటలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది ని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పేకాట స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీసులకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించి అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఎనిమిది మంది వ్యక్తులతో పాటు, రూ.52,240 నగదు, ఆరు సెల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిసింది.

# పోటాపోటీగా సోషల్ వెల్ఫేర్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

- ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ
- ఏడు జోన్ల పీఈటీలు, పీడీలతో కోచింగ్ క్యాంపు

పాల్వంచ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్థాయి సోషల్ వెల్ఫేర్ గురుకులాల క్రీడాపోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఏడు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు పలు విభాగాల క్రీడాపోటీల్లో తమ ప్రతిభను కనబరుస్తూ ఆడుతున్నారు. రెండు రోజులపాటు జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ సెక్రటరీ సక్రునాయక్, మల్టీజోన్ అధికారి అలివేలు మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్ క్రీడాకారులు క్రీడల్లో మంచి గుర్తింపు తెస్తున్నారని అన్నారు హైదరాబాద్‌లో జరిగే ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ గురుకులాల రాష్ట్రస్థాయి పోటీలకు ఈ పోటీల్లో ప్రతిభను చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి కోచింగ్‌క్యాంపు నిర్వహిస్తామని అన్నారు. ఏడు జోన్లలో ఉన్న పీఈటీలు, పీడీలు క్రీడాకారులకు కఠోర శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ స్పోర్ట్స్ మీట్ ఇన్‌చార్జి శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, జోనల్ అధికారులు స్వరూపరాణి, ప్రత్యూష, విజయరాణి, ప్రిన్సిపాల్ పాపారావు, ప్రిన్సిపాల్ కన్నెకంటి వెంకటేశ్వర్లు, పద్మావతి, సైదులు, రంగారావు, పీడీ మల్లేష్ పాల్గొన్నారు.



క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

**అథ్లెటిక్స్‌లో గెలుపొందిన క్రీడాకారులు..**

అండర్ - 14 విభాగంలో 600మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో ఎ. విశాల్ (జోగులాంబ జిల్లా), ద్వితీయ స్థానం ఎం. నితీన్ (భద్రాద్రి జిల్లా), తృతీయస్థానంలో పీ. రాకేష్ (కాళేశ్వరం), లాంగ్‌జంప్ పోటీలో ప్రథమ స్థానంలో సీహెచ్. నితీన్ (యాదాద్రి జిల్లా), ద్వితీయస్థానంలో పి. చరణ్ (కాళేశ్వరం), తృతీయస్థానంలో ఎం. ప్రవీణ్ (జోగులాంబ జిల్లా), షాట్‌పుట్‌పోటీలో ప్రథమస్థానంలో ఎం. మహేష్ (యాదాద్రిజిల్లా), ద్వితీయస్థానంలో ఎం. ప్రవీణ్ (జోగులాంబ జిల్లా), వి. తేజ (యాదాద్రి).

**అండర్ - 17 విభాగంలో..**

షాట్‌పుట్ పోటీలో ప్రథమస్థానంలో శివరాజ్ (బాసర), ద్వితీయ స్థానంలో కె. ఆనంద్ (భద్రాద్రి జిల్లా), తృతీయ స్థానం కె. సంకేత్ (బాసర), లాంగ్‌జంప్‌పోటీలో ప్రథమ స్థానంలో కె. ప్రవీణ్ (యాదాద్రి జిల్లా), ద్వితీయస్థానంలో కె. ఆనంద్ (భద్రాద్రి జిల్లా), తృతీయస్థానంలో అనీల్‌కుమార్ (జోగులాంబ జిల్లా)

**అండర్ - 19 విభాగంలో..**

షాట్‌పుట్ పోటీలో ప్రథమస్థానంలో టి. అరవింద్ (యాదాద్రి), ద్వితీయస్థానంలో సిద్దార్థ (చార్మినార్), తృతీయస్థానంలో ఎ. గణేష్ (జోగులాంబ). లాంగ్‌జంప్ పోటీలో ప్రథమ స్థానంలో ఎ. గణేష్ (జోగులాంబ), ద్వితీయ స్థానంలో కె.ఉదయ్‌కిరణ్ (జోగులాంబ), తృతీయస్థానంలో డి. గణేష్ (కాలేశ్వరం). 500మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానంలో శివకుమార్ (జోగులాంబ), ద్వితీయస్థానంలో బి. గోపీచంద్ (యాదాద్రి), తృతీయస్థానంలో సి. అనీల్ (జోగులాంబ).



వాలీబాల్ పోటీలో తలపడుతున్న భద్రాద్రి కొత్తగూడెం, చార్మినార్ జట్లు

## బందాల అడవుల్లో పెద్దపులి..

- డీఎఫ్‌వో సయ్యద్ మక్సూద్ మొహిద్దీన్

కరకగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపులి సంచారంతో అటవీ ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ములుగు జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ ప్రాంతంలోకి చేరిన పెద్దపులి వెనక్కు వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులు తెలపడంతో ప్రజలు ఊరిపి పీల్చుకున్నారు. తిరిగి గురువారం మోతే అటవీలో పెద్దపులి కనిపించడంతో ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం కరకగూడెం మండలం మోతే అటవీ ప్రాంతం సరిహద్దు ఎర్ర చెరువు వద్ద పెద్దపులి పాద ముద్రలు కనిపించినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఎర్ర చెరువు ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ కనిపించిన పాద ముద్రలు పెద్దపులివి కాదని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' మణుగూరు డీఎఫ్‌వో సయ్యద్ మక్సూద్ మొహిద్దీన్ వివరణ కోరాగా.. పెద్దపులి కరకగూడెం మండలంలో గురువారం సంచరించిన విషయం వాస్తవమే అన్నారు. కానీ శుక్రవారం మోతే అటవీ ప్రాంతం ఎర్ర చెరువు ప్రాంతంలో పాద ముద్రలు అవాస్తవమని, వదంతులు నమ్మొద్దని తెలిపారు. శుక్రవారం భద్రాద్రి జిల్లా, ములుగు జిల్లా సరిహద్దు మండాల అటవీ ప్రాంతాలలో పెద్దపులి సంచరించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో తిరుగుతున్న పెద్దపులి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రత్నగిరి ప్రాంతం నుంచి వచ్చిన మగ పులిగా గుర్తించినట్లు తెలిపారు. ఆల్లపల్లి, గుండాల మండలాల అటవీలో కూడా పెద్దపలి సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని, అక్కడ సంచరిస్తున్నది ఆడపులి కావచ్చని తెలిపారు. ప్రజలు, కాపర్లు అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని తెలిపారు. తప్పుడు సమాచారంతో ప్రజలను ఎవరు కూడా ఆందోళనకు గురిచేయవద్దని కోరారు.



చీఫ్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీడీవోల సంఘం నాయకులు

## ఎంపీడీవోల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

మణుగూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఎంపీడీవోల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవోల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంత కుమారిని కలిసి వినతి పత్రాన్ని అందించింది. గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, తెలంగాణ జేఏసీ సెక్రటరీ జనరల్‌ల సారథ్యంలో సీఎస్‌ను కలసి వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, ఎం మోహన్, దివ్య దర్శనం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## భూభారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని




కొత్తగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన భూభారతి 2024 చట్టం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో జరిగిన శీతాకాల సమావేశంలో కొత్తగా ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై ఎమ్మెల్యే కూనంనేని పలు అంశాలపై మాట్లాడారు.1970కు ముందు ఉన్న భూములకు, గిరిజనేతరులకు సాదాబైనామాల ద్వారా పట్టాదార్ పాస్‌బుక్‌లు, భూ యాజమాన్య హక్కులు కల్పించాలని అన్నారు. రేగళ్ల ప్రాంతంలో ఉన్న పేదల భూములకు జమీందార్ల నుంచి సక్రమించిన భూములకు పట్టాలు చేయాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంబసత్రం భూముల రైతులకు పథకాలు వర్తించేవిధంగా గుర్తింపు కార్డును అందచేయాలని కోరారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములను ప్రత్యేక జాబితాగా తయారుచేయడం ద్వారా రైతు భరోసా ప్రభుత్వం అందజేసేటప్పుడు ఉపయోగపడుతుందన్నారు. మా గొంతులు నొక్కడానికి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు ఎక్కడ ఉందని వారికి ఎవరు కల్పించారు హక్కు అని ఎమ్మెల్యే కూనంనేని ప్రశ్నించారు.

## సీతారామ కాల్వలకు నిధులు

- నాచారం, మేడేపల్లి గ్రామాలకు వరం
- రూ.25కోట్లతో పనులు ప్రారంభానికి సిద్ధం
- భూసేకరణ పనులు ప్రారంభం

ఏన్కూరు, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.25కోట్లతో ఏన్కూరు మండలానికి మరో సీతారామ మైనర్ పంట కాలవల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. ఈమేరకు అధికారులు భూసేకరణ పనులు ప్రారంభించారు. పూర్తిగా పంట కాలవలకు నీరు అందించే మైనర్ కాలవల నిర్మాణం 2025 చివరి నాటికి పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు. ఈపిల్ల కాలవల ద్వారా నాచారం, మేడేపల్లి, భద్రతండా, రాజులపాలెం, మూన్యతండా, రామతండా, ఒట్టిగుడిశ గ్రామాల పరిధిలోని 2500 ఎకరాల భూమి సస్యశ్యామలం కానుంది. ఈగిరిజన గ్రామాలన్నీ వర్షాధారం మీదనే ఆధారపడి గిరిజనులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ 17 ఎల్‌కాలవ జూలూరుపాడు సీతారామ ప్రధాన కాలవ 98.35 వద్దనుంచి ఏన్కూరు మండలంలోకి ప్రవేశిస్తుంది. తొమ్మిది కిలోమీటర్లు ఏన్కూరు మండలంలో ప్రవేశించి నాచారం వద్ద నాలుగు పిల్ల కాలవలుగా విడిపోతుంది.

నాచారం 1 మైనర్‌కాలవ..350మీటర్లు, నాచారం మైనర్ 2.. 680మీటర్లు, నాచారం 3 మైనర్‌కాలవ 1725మీటర్లు, నాచారం 4 మైనర్‌కాలవ 2.1 కి.మీ. ద్వారా పంట కాలవలకు నీరు అందించేందకు ప్రణాళికలు సిద్ధంచేశారు. కాలవ సమీపంలోని చెరువులు, కుంటలను నింపేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు. వీటి పనులను ఇరిగేషన్ శాఖ డీఈ మధు, జేఈ వంశీ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.



శుక్రవారం మధ్యాహ్నం తాళం వేసిన పాఠశాల

## టీచర్లు లేక బడి మూత

ఆళ్లపల్లి, డిసెంబరు 20: ఆళ్లపల్లి మండల విద్యాశాఖ అధికారికి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మధ్య సమన్వయం లేకపోవడంతో సింగల్ ఉపాధ్యాయుడు ఉన్నచోట బడులు మూతపడుతున్నాయి. ఒకే ఉపాధ్యాయుడు ఉన్న చోట ఆ ఉపాధ్యాయుడు సెలవు పెడితే, కాంప్లెక్స్ పరిధిలోని మిగతా వారిలో ఒకరిని ఆ పాఠశాలకు కేటాయించాలి. కాగా ఇక్కడ మాత్రం ఉపాధ్యాయుల్లో సమన్వయం లేకపోవడంతో బడులు రెండు, మూడు రోజులు బంద్ అయిన సంఘటనలు ఉన్నాయి.

మండల పరిధిలోని తునికిబండల పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. సదరు ఉపాధ్యాయుడు అయ్యప్పదీక్ష తీసుకోవడంతో శబరియాత్ర వెళ్లేందుకు సెలవు పెట్టారు. ఈ క్రమంలో ఆ పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని కేటాయించకపోవడంతో గురువారం విద్యార్థులను వంట మనిషి చూసుకుంది. శుక్రవారం మరో ఉపాధ్యాయుడు వచ్చినప్పటికీ ఒంటిపూట బడిపెట్టి సొంత పాఠశాల విధులకు వెళ్లిపోయాడు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' డీఈవో వెంకటేశ్వరచారిని వివరణ కోరగా ఉపాధ్యాయులు లేని చోట, ఆ కాంప్లెక్స్ పరిధిలోని, ఒక టీచర్‌ను కేటాయించాలని, వివరాలు ఎంఈవోను అడిగి తెలుసుకుంటానని అన్నారు.

### ముగిసిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు

చుంచుపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 భద్రాద్రి జిల్లా స్థాయి పోటీలు ప్రశాంతంగా ముగిశాయని డీవైఎస్‌వో పరందామరెడ్డి శుక్రవారం తెలిపారు. 16వ తేదీ నుంచి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో వివిధ క్రీడా విభాగాలలో జరుగుతున్న వ్యక్తిగత, జట్ల ఎంపిక క్రీడా జిల్లా పోటీలు పకడ్బందీగా నిర్వహించి పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో వ్యక్తిగతంగా ఉత్తమ ప్రదర్శన కనపరిచిన క్రీడాకారులు, ఎంపికైన క్రీడా జట్లు ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు హైదారాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు భద్రాద్రి జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ క్రీడలు సజావుగా సాగేందుకు సహకరించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఎస్పీ రోహిత్‌రాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ నరేష్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగేందర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నేడు ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ఆహార దినోత్సవం




ప్రభుత్వం ప్రచారం చేయాలని ముద్రించిన కరపత్రం

కొత్తగూడెం అర్బన్/ అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థుల విద్యా ప్రగతే లక్ష్యంగా ప్రతినెల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల దినోత్సవాలను నిర్వహిస్తుంది. ఈనేపథ్యంలో ఈనెల 21న 'తెలంగాణ ఆహార దినోత్సవం' పేరిట వైభవంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సమాగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, స్థానికసంస్థల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని మార్గదర్శకాలను అనుసరించాలని ఉన్నతాధికారులు విద్యాలయాల బాధ్యులను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం తయారుచేసే వంటకాలను, పదిమంది విద్యార్థులతో పంచుకునేలా అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవనుంది.

అందుబాటులో ఉండే పౌష్టిక ఆహారాన్ని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాలను రూపొందించారు. పండ్లు, కూరగాయలు వంటి పౌష్టిక ఆహార పదార్థాలను విద్యార్థులకు ఏ విధంగా అందించాలో కరపత్రాల ద్వారా తల్లిదండ్రులకు, విద్యార్థులకు పరిచయం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు తెచ్చిన ఆహార పదార్థాల ప్రత్యేకత, ఉపయోగించిన పదార్థాలు, తయారీ విధానం, పోషక విలువల గురించి తల్లిదండ్రులకు వివరించేలా ప్రోత్సహిస్తారు. సమావేశంలో పాల్గొనే వారంతా ప్రశ్నలు, జవాబులు రూపంలో వంటకాల విశేషాలను పంచుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఈనెల 21న జరగనున్న ఈ కార్యక్రమంలో విద్యార్థి, తల్లిదండ్రులు పాల్గొనేలా తేదీ, సమయాన్ని సూచిస్తూ వారికి ఆహ్వానాలు పంపించనున్నారు. ఇప్పటివరకు జరిగిన సమావేశాలకు రానివారందరిని గుర్తించి తప్పకుండా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉంది. వారి సెల్‌ఫోన్‌ల వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. తద్వారా యూ డైస్ యాప్‌లో వివరాలు నమోదు ప్రక్రియను పూర్తిచేస్తారు.



కవల సోదరులను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల

## కవల సోదరులకు ప్రభుత్వ సత్కారం

ఇల్లెందు, డిసెంబరు 20. (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ సాగు చేస్తూ వివిధ ప్రాంతాల రైతులకు అవగాహన కల్పిస్తున్న ఇద్దరు కవల సోదరులను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. టేకులపల్లి మండలం చింతోనిచెలక గ్రామానికి చెందిన కంభంపాటి చంద్రశేఖర్‌రావు కవల కుమారులు నరేష్, నవీన్ ఇంజనీరింగ్ విద్య అభ్యసించారు. వ్యవసాయంపై మక్కువ కలిగి స్వతహాగా 20 ఎకరాల్లో మిర్చి, వరి, కూరగాయలు సహజ వ్యవసాయ (ఆర్గానిక్ ) పద్ధతుల్లో పండిస్తున్నారు. వారి కృషి గుర్తించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు వజ్రోత్సవాల్లో కిసాన్ మేళా సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, కమిషన్ ఛైర్మన్ పోచారం శ్రీనివాసరెడ్డి తదితరులు కవల సోదరులను ఘనంగా సన్మానించారు.

## రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దు

- సిబ్బందికి అదనపు కలెక్టర్ ఆదేశం

చంద్రుగొండ, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): కేంద్రానికి తరలించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని, రోజుల తరబడి జ్యాప్యం చేస్తూ రైతును ఇబ్బందులకు గురిచేయవద్దని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం చంద్రుగొండ మార్కెట్ యార్డులోని ధాన్యాం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యాన్ని పరిశీలించి అక్కడున్న రైతులతో మాట్లాడారు. బస్తాలు, తూర్పారపట్టే మిషన్, లారీలు తగినన్ని లేకపోవటంతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని రైతులు అదనపు కలెక్టర్ దృష్టి తెచ్చా రు. దీనిపై స్పందించి ఆయన తక్షణమే సామగ్రిని ఏర్పాటు చేసుకొని కొనుగోళ్ల వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## రాష్ట్రంలో ఏపీజీవీబీ ఇక టీజీబీ

- నాలుగు రోజుల పాటు సేవలు బంద్
- రీజినల్ మేనేజర్ ఉదయ్ ముక్తాపురం

చుంచుపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) గా మారుతోందని భద్రాచలం రీజినల్ మేనేజర్ ముక్తాపురం ఉదయ్ తెలిపారు. శుక్రవారం విద్యానగర్ కాలనీలోని రీజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. భారత ప్రభుత్వ ఆర్థిక సేవల శాఖ (డీఎఫ్ఎస్) ప్రకారం ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల మధ్య కార్యకలాపాలను విభజిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పాటు చేసి, 493 శాఖలను విలీనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విభజన ప్రక్రియలో సాంకేతిక సమస్యల కారణంగా సాఫ్ట్‌వేర్‌ను అప్డేట్ చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు బ్యాంకింగ్ సేవలను నిలిపివేస్తున్నట్లు ఈ నాలుగు రోజులు ఖాతాదారులు సహకరించాలని కోరారు. తిరిగి నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త సంవత్సరం జనవరి 1వ తేదీన డీజీబి పేరుతో తిరిగి బ్యాంకు సేవలను ఖాతాదారులకు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ రీజినల్ కార్యాలయం పరిధిలో జిల్లాలో 42 బ్రాంచ్‌లు, 1.30 లక్ష మంది ఖాతాదారులు ఉన్నారని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌ఎం

## ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు

ఖమ్మంటౌన్,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధనవనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల14నుంచి ప్రారంభమైన ఇంధన పొదుపు వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉమ్మడి జిల్లా మేనేజర్ జీ.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించామని, విజేతలకు బహుమతులు అందచేశామన్నారు. తరగని ఇంధన వనరు అయిన సౌరశక్తి వినియోగం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చొన్నారు. ప్రజలు సౌరశక్తి వినియోగంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందనవనరుల అభివృద్ధిసంస్థ సిబ్బంది, రవాణాశాఖ ఏవో ఎండీ. జహార్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

| | |
|---|---|
| టమాటా | 24 రూ. |
| వంకాయ | 48 |
| గుత్తి వంకాయ | 50 |
| బీరకాయ | 54 |
| పచ్చిమిర్చి | 30 |
| కాకరకాయ | 48 |
| బెండకాయ | 48 |
| పొట్లకాయ | 50 |
| దోసకాయ | 34-44 |
| చిక్కుడు | 48 |
| నాటుచిక్కుడు | 88 |
| గోరుచిక్కుడు | 54 |
| క్యాబేజీ | 28 |
| దొండ | 54-60 |
| సొరకాయ | 28 |
| క్యారెట్ | 38 |
| క్యాప్సికం | 68 |
| ఆలుగడ్డ | 34 |
| ఉల్లిగడ్డ | 50-60 |
| కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు) | 195 |
| కొత్తిమీర కట్ట | 40 |

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

## సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

| | |
|---|---|
| వినోద: | ముఫాసా |
| శ్రీనివాస: | బచ్చలమల్లి |
| సాయిరాం: | విడుదల |
| కేపీఎస్: | పుష్ప 2 |
| తిరుమల: | పుష్ప 2 |
| సినీ గెలాక్సీ: | ప్రణయగోదావరి |

## సెమినార్‌లో పాల్గొనేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చేవిద్యాసంవత్సరం రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల సైన్స్‌ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈవో సోమశేఖర శర్మ, సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ శుక్రవారం తెలిపారు. ఈ సెమినార్‌లో ప్రధాన అంశం 'సైన్స్ ఇన్ అవర్ వరల్డ్'గా ఉంటుందని, సైన్సు ఉపాధ్యాయులు, విద్యావంతులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సెమినార్ లో ఉప అంశాలుగా సైన్స్ బోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎకలాజికల్ బ్యాలెన్స్ ఫుడ్, ఎడ్యుకేషన్-రోల్ ఆఫ్ టీచర్స్,సైన్స్ ఎడ్యుకేషన్ స్థాయి పెంపునకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలు, రసాయన శాస్త్రం అభ్యసనపై సెమినార్ పత్రాలు రూపొందించుకొని పాల్గొనవలసి ఉంటుందని తెలిపారు.జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్సుఉపాధ్యాయులకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## కల్లూరుకు రిక్తహస్తం

### కలగా మిగిలిన మునిసిపాలిటీ

కల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసే మునిసిపాలిటీల జాబితాలో రెవిన్యూ డివిజన్ కేంద్రమైన కల్లూరుకు చోటు దక్కలేదు. కల్లూరు మునిసిపాలిటీగా ఏర్పాటై మరింత అభివృద్ధి చెందుతుందని ఆశించిన ఈ ప్రాంత ప్రజలకు నిరాశ మిగిలింది. పూర్వపు సమితి, ప్రస్తుత రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మునిసిపాలిటి ఏర్పాటుకు అవసరమైన జనాభా, మౌళిక సౌకర్యాలు ఉన్నాయి. ఐనా కల్లూరుకు మునిసిపాలిటిగా ఏర్పాటు కాకపోవటంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు హమీలు ఇచ్చారు. శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్రంలో నూతనంగా 2కార్పొరేషన్లు, 12 మునిసిపాలిటీలు ఏర్పాటుకు ఆమోదం తెలపటం తెలిసిందే.. వీటిల్లో రాష్ట్రంలో మేజర్ పంచాయితీ అయిన (పెద్దదైన) కల్లూరు మునిసిపాలిటీగా ప్రకటించక పోవటంతో నిరాశ కలిగించింది. గతప్రభుత్వం అధికారంలో ఉండగా కల్లూరు మునిపాలిటీని చేసే విషయంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నాటి పాలకులు కూడా దీనిపై హామీ ఇచ్చారు కానీ, ప్రభుత్వం మారటంతో అదికార్యరూపం దాల్చలేదు. మండలం నుంచి మంత్రి వర్గంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ నుంచి అధికార పార్టీ ఎమ్మెల్యేగా మట్టా రాగమయి ప్రాతినిధ్యం వహిస్తున్నా.. కల్లూరు మునిసిపాలిటీ చేసే విషయంలో వారు తగిన చొరవ చూపలేక పోయారని స్థానికుల్లో అసంతృప్తి నెలకొన్నది.



కాంగ్రెస్‌లో చేరిన 46వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి

## కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కార్పొరేటర్

ఖమ్మంటౌన్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలోని 46వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో మేయర్ పునుకొల్లు నీరజసమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ వైష్ణవికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్పొరేటర్‌తో పాటు బీఆర్ఎస్ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు తొగర భాస్కర్, సహాయ కార్యదర్శి తొగరు రమేష్, మైనారిటీ విభాగం నగర కార్యదర్శి షేక్ గౌస్ పాషా కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర తిలక్, 46వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ రజీ,పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల్లోనే ఉంటా, వారి కోసమే పని చేస్తా

» పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కందాళ

నేలకొండపల్లి,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి):ప్రజల్లోనే ఉంటా, ప్రజల కోసమే పని చేస్తానని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేలకొండపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కందాళ ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలపై మాట్లాడటానికి ఇష్టం లేదన్నారు. ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష ప్రజలు ఆమోదించరన్నారు. నియోజకవర్గ ప్రజలు ఏ అవసరం వచ్చినా తన ఇంటికి రావచ్చని కందాళ అన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ నేలకొండపల్లి కార్యదర్శి గొలుసు రవి ఇంట్లో అల్పాహారం తీసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీను, నాయకులు మరికంటి రేణుబాబు, అనగాని నర్సింహారావు, గొలుసు రవి, జటంగి వెంకన్న, శంకర్ పాల్గొన్నారు.

## పిల్లలకు తొలిగురువులు తల్లిదండ్రులే

» నాణ్యమైన విద్యను అందించండి
» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
» ఘనంగా సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం





కొమురంభీం వేషధారణలో ఉన్న విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఉపాధ్యాయులను అభినందిస్తున్న కలెక్టర్

నేలకొండపల్లి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): పిల్లలకు అమ్మా-నాన్నలేనని తొలి గురువులని తల్లిదండ్రుల శిక్షణలోనే వారిభవిష్యత్ బాగుంటుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జరిగిన నేలకొండపల్లిలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత పాఠశాల విద్యార్థుల అభినయించిన నాటికలు, ఏకపాత్రాభినయం ఆసక్తిగా తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని తిలకించే అవకాశం ఈరోజు నాకు దక్కిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రతీపాఠశాలల్లోనూ పెట్టుకునేలా చూస్తానన్నారు. పాఠశాల, పిల్లలపై ప్రేమ ఉంటేనే ఇటువంటి మంచి కార్యక్రమాలను చూడగలుగుతామన్నారు. పాఠశాల ఇంత అభివృద్ధి చేసుకున్నా జిల్లా యంత్రాంగం నుంచి ఏమీ ఆశించకపోవటం ఆశ్చర్యంగానూ, సంతోషంగానూ ఉందన్నారు.మొత్తం సొంతగా, పూర్వవిద్యార్థుల సహాయంతో చేసుకున్నట్లు హెచ్ఎం చెప్పటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇది గ్రామానికి, పాఠశాలకు దక్కిన గొప్ప వరంగా భావిస్తున్నానన్నారు. తాము సర్వీసులో చేరినప్పుడు ఒకజిల్లా నుంచి ఒక జిల్లాకు వెళుతుంటామని, అసలు ఎందుకు చేరామా అనుకుంటుంటామని, కలెక్టరేట్‌లో దాదాపు 60 శాఖలుంటాయన్నారు. అందులో విద్యాశాఖకు చేయగలిగినంత ఏశాఖకు చేయలేమన్నారు. మనంఏం చేసినా పిల్లల భవిష్యత్తు కోసమేనని అందుకు సమయాన్ని కేటాయించటంతో పాటుగా శ్రమించాలన్నారు. ఉపాధ్యాయులు కేవలం బోధనలే పరిమితం కాకూడదని, మనసు పెట్టి నాణ్యమైన విద్యను అందించటానికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో పెద్ద స్థాయికి వెళ్లాక మమ్మల్ని మర్చిపోయినా, చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా ఉండాలన్నారు. ఇంతమంచి కార్యక్రమం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు హరిశ్రీనివాస్, ఉపాధ్యాయులను తప్పక అభినందించాల్సిందేనన్నారు.

### ఆకట్టుకున్న కార్యక్రమాలు

వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయనాలు, నాటికలు కలెక్టర్‌తో పాటుగా తల్లిదండ్రులను, ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కొమురం భీం, చాకలి ఐలమ్మ, లవకుశ ప్రదర్శనలు బాగా ఆకట్టుకున్నాయి. నాటికలు, ఏకపాత్రాభినయనాలు చేసిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. వారి నటనకు ఫిదా అయ్యారు. పిల్లలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరి శ్రీనివాస్, తహసీల్దార్ః జాదవ్ మాణిక్యం,ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంఈఓ చలపతిరావు పాల్గొన్నారు.

### నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి పొందాలి

ఖమ్మంరూరల్: నైపుణ్యాభివృద్ధితో సొంత బలం మీద ఉపాధి పొందడమే కాక పది మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని ఉపాధి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. వరద ముంపు ప్రాంతప్రజలకు స్వయం ఉపాధికి ఆర్సీయం బిషప్ సగిలి ప్రకాష్ ఆధ్వర్యంలో కరుణగిరి బైపాస్ రోడ్‌లోని కారుణ్య కమ్యూనిటి సెంటర్లో ఏర్పాటు చేసిన నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. కట్టుమిషన్, హోమ్ నర్సింగ్, ఇస్తరాకులు, కప్స్, క్యాండిల్స్, అగరవత్తుల తయారీ, బ్యూటీషియన్ తదితరాల్లో నైపుణ్యం పొంది, స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలన్నారు. అక్కడికి వచ్చిన మహిళలతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజీవ్ గృహకల్ప సమీపంలోని మదర్‌థెరిస్సా ఓల్డ్‌ఏజ్ హోమ్‌ను కలెక్టర్ సందర్శించారు. ఆశ్రమంలో అనాధలకు అందుతున్న సేవలను పరిశీలించారు. వరదల వల్ల దెబ్బతిన్న భవనాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఫాదర్ తప్పెట శౌరీ, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలి

» వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నేతల ఆగ్రహం
» దిష్టిబొమ్మ దహనం




సరితాక్లినిక్ సెంటర్‌లో దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంటౌన్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్, అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం డివిజన్‌కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని సరితా క్లినిక్ సెంటర్‌లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో అమిత్‌షా అంబేద్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యానించారని ఆరోపించారు.ప్రధాని మోడీ హోంమంత్రి అమిత్‌షాను సమర్థించటం తీవ్ర అన్యాయమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు యర్రా శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బుగ్గవీటి సరళ, టీ. నాగరాజుపాల్గొన్నారు.

### రేపు మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో నిరసన

ఖమ్మంటౌన్: అమిత్‌షాను భర్తరఫ్ చేయాలని,ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని అఖిలపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని జిల్లా సీపీఎం కార్యాలయం సుందరయ్యభవన్‌లో జరిగని సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు,సీపీఐజిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లానాయకులు సీవై.పుల్లయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎండీ.హుస్సేన్ మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలు అంబేద్కర్‌కు మాత్రమే జరిగిన అవమానం కాదని, భారత రాజ్యాంగాన్ని అవమానించటమే నన్నారు. అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ఇతర వామపక్ష పార్టీలతో కలిసి ఆదివారం మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్

ఖమ్మంక్రైం,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనర్ కార్యాలయం ఏవో(అడ్మినిస్ట్రేషన్‌ఆఫీసర్)గా బి.చంద్రకళ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వరంగల్ కమిషనరేట్ సెక్షన్‌సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఏవోగా పదోన్నతిపై ఖమ్మం కమిషనరేట్‌కు బదిలీఅయ్యారు.ఈనేపథ్యంలో గురువారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అనంతరంఅదనపు డీసీపీలు ప్రసాదరావు,నరేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



సీపీ సునిల్‌దత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చంద్రకళ

## దరఖాస్తు హార్డ్‌కాపీలు అవసరంలేదు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీ మహిళలకు అందించే కుట్టుమిషన్ దరకాస్తులకు హార్డ్ కాపీలను ఈనెల 21లోగా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కె సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## ప్రశాంతంగా విద్యాప్రవేశ్ పరీక్ష

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): విద్యాప్రవేశ్ మాడ్యూలు (1వ తరగతి విద్యార్థులకు)పోస్ట్ టెస్టు శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఇందిరానగర్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మల్లెమడుగులలో ఎన్‌సీఈఆర్‌టీ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతీపాఠశాల నుంచి 8 మంది చొప్పున 1వతరగతి విద్యార్థులని గుర్తించి వారికి ఎస్సీఈఆర్టీ వారు అందజేసిన కిట్లను ఉపయోగిస్తూ టెస్ట్ నిర్వహించామని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్, ఖమ్మంఅర్బన్ మండల విద్యాశాఖాధికారి శైలజాలక్ష్మీ తెలిపారు. ప్రతీపాఠశాల నుంచి ఒకటో తరగతి బోధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను పాఠశాల విద్యాప్రవేశ్ మాడ్యూల్



వినియోగంపై బోధనలో ఎదురవుతున్న సమస్యలపై ఇంటర్వ్యూ నిర్వహించి వారి స్పందనలను నమోదు చేశామన్నారు. కార్యక్రమాన్ని ఎస్సీఈఆర్టీ, ఢిల్లీ ప్రతినిధి ప్రొఫెసర్ టి.కొండలు పర్యవేక్షించారు.

## రుద్రాక్ష, జాతిరత్నాల ఎగ్జిబిషన్ నేటితో ముగింపు



ఖమ్మంబైపాస్‌రోడ్,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఖమ్మంఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్లో నేపాలీ రుద్రాక్ష, జాతిరత్నాల ఎగ్జిబిషన్‌కమ్‌సేల్ శనివారంతో ముగియనున్నది. ఈఎగ్జిబిషన్‌లో ఏకముఖి నుంచి 21 ముఖాల వరకు రుద్రాక్షలు, సిద్ధిమాల, కలింగమాల, జాతిరత్నాలు లభిస్తాయని నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## అర్హులందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలి

తిరుమలాయపాలెం, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికి రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పిండిప్రోలులోని రాయల వెంకటనారాయణ స్మారక భవనంలో సమావేశంలో మాట్లాడుతూ ఏళ్లతరబడిగా రేషనర్‌కార్డులు లేక నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఇందిరమ్మ కమిటీలతో సంబంధం లేకుండా పేదలను గుర్తించి ఎటువంటి రాజకీయ వత్తిళ్ల లేకుండా వారికి ఇళ్ల మంజూరు చేయాలన్నారు. ఈసమావేశంలో మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, పి.వెంకటస్వామి, మీగడ సత్యం, యడ్లపల్లి నవీన్, ఆరెంపుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా బ్యాంకర్లు దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. బ్యాంకులు సకాలంలో రుణాలు అందించి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అన్నారు. 2024-25 వార్షికరుణ ప్రణాళికలో సెప్టెంబరు2024 వరకు 2722.66 కోట్లు స్వల్పకాలిక పంట రుణాలుగా అందచేసినట్లు తెలిపారు. వ్యవసాయ టర్మ్ రుణాలుగా వ్యవసాయ రంగానికి 1239.55 కోట్లు బ్యాంకుల ద్వారా పంపిణీచేసినట్లు తెలిపారు. ఎస్సీఎస్టీలబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించాలని సూచించారు. జిల్లాలో 764 మహిళా సంఘాలకు 2024-25 సంవత్సరానికి రూ.11074.30 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్బీఐ ఎల్డీఓ సాయితేజరెడ్డి, నాబార్డ్ డీపీఎం సుజిత్ కుమార్, యూబిఐ డీజీఎం హనుమంత రెడ్డి, ఎస్బిఐ సీఎం వెంకటేశ్వరరావు, ఏపీజీవీబీ సీఎం శ్రీహరి, డీసీసీబీ సీఈవో ఎన్ వి.ఆదిత్య పాల్గొన్నారు.

## నిధులను పారదర్శకంగా వినియోగించాలి

### గ్రంథాలయ సర్వసభ్య సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): గ్రంథాల సంస్థ వద్ద అందుబాటులో ఉన్న నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గ్రంథాలయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లాలో 17 గ్రామపంచాయతీలలోని పబ్లిక్ రీడింగ్ రూమ్‌లకు రూ.14లక్షల 9వేల 275 చెల్లించాల్సి ఉండగా గతంలో బడ్జెట్ లాప్స్ అయ్యిందన్నారు. ప్రస్తుతం 2024-25లో పబ్లిక్ రీడింగ్ రూమ్స్ పద్దుపై అందుబాటులో ఉన్న రూ.10 లక్షలు చెల్లించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో గ్రంథాలయాల మరమ్మతుల కోసం రూ.83 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి రూ.50లక్షలు ఖర్చు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు ఆమె తెలిపారు. మిగిలిన రూ.33 లక్షల ఖర్చు చేసేందుకు తర్వాతి సర్వసభ్య సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, వయోజన విద్య ఉపసంచాలకుడు జయశంకర్, గ్రంథాలయ కార్యదర్శి వి.అర్జున్, గ్రంథాలయ సిబ్బంది జె.భాస్కర్, వి. అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి (ఉమ్మడి) జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్-17 బాలికల జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎజీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 1-1-2008 తరువాత జన్మించి ఉండాలని, 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారిణులు ఉదయం 9 గంటల కల్లా స్టేడియానికి హాజరుకావాలని కోరారు.

## జిల్లా జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఈనెల27 నుంచి జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను శుక్రవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 205 మంది బాలురు, 52 మంది బాలికలు హాజరైనారు. బాలికల జట్టులో కావేరి, అమీనాబేగం, నికిత, హాని, నాగమణి, స్పందన, హారిక, కావ్యశ్రీ, బిందు, విద్యాశ్రీచందన, నవిత, తేజ స్టాండ్‌బైలుగా భావన, మేఘన, ప్రిన్సి, క్రిష్ణవేణి ఎంపికయ్యారు. బాలుర జట్టులో జగదీష్, కౌశిక్, అజయ్, రోహిత్‌కుమార్, హితేష్, నాగరాజు, రాజేష్, వికాస్, రాకేష్, శ్రీనివాస్, గోపి, నవీన్, స్టాండ్‌బైలుగా శివక్రిష్ణ, సుధీర్, శివ, విష్ణులు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపికలను పీడీలు నాగప్రసాద్, సుధాకర్, సత్యనారాయణ, లాలయ్య, శేఖర్, శోభన్న, నరేష్, శివక్రిష్ణ తదితరులు పర్యవేక్షించారు.

## క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

### తుంబూరు దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాలు, పట్టణాలకు చెందిన క్రీడాకారుల మధ్య క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బోదులబండలో కోదాడ, పాలేరు నియోజకవర్గాలస్థాయి టెన్నిస్‌బాల్, క్రికెట్ టోర్నమెంట్‌ను దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడలు నిర్వహిస్తున్న మదర్‌థెరిస్సా యూత్‌ను దయాకర్‌రెడ్డి అభినందించారు. అనంతరం బోదులబండలోని శ్రీసువర్చలా ఆంజనేయస్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కట్టికోల నాగార్జున, వెన్నపూసల సీతారాములు, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు గులాబీ పువ్వులు అందిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

## జనవరి 3న ఒలింపియాడ్ పోటీలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలలో ప్రథమ, ద్వితీయ స్థానాలో నిలిచిన వారికి మండల స్థాయిలో పోటీ పరీక్షలు వచ్చేనెల 3వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వహకులు చెరుకు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశ్నాపత్రాలు, వకృత్వంలో 10అంశాలను ఆవిష్కరించి పాఠశాలల స్థాయిలో విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.జయరాజు, ఉపాధ్యాయులు అరుణతార, అమీరియా, మాధవి, ఎస్.వెంకటేశ్వరరావు, ఉదయ్, దేవీసింగ్ పాల్గొన్నారు.

## పుస్తకాల పంపిణీ

వైరా, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం ఎంతో తోడ్పాటునందించిన అదే గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు కొండబోలు సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆపాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. సురేష్ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. బెజవాడ వీరభద్రరావు, ఉపాధ్యాయులు దొబ్బల శ్రీదేవి, జాకీర్, అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ చిమ్మచీకట్లు

» ఇంకా మొదలుకాని సెంట్రల్ లైటింగ్ పనులు

» వైరాలోని మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డులో వెలగని వీధిలైట్లు

వైరా, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ, మండల, మునిసిపల్ నియోజకవర్గ కేంద్రమైన వైరాలో ఇది ప్రధాన ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు. 15రోజుల నుంచి కిలోమీటర్ దూరం రాత్రివేళ కారుచీకట్లు అలుముకున్నాయి. ఆర్‌అండ్‌బీ, మునిసిపల్, ట్రాన్స్‌కో శాఖల అధికారులు ఈ గాంఢాధకారం నుంచి ప్రజలకు వెలుగునందించే విషయంలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంలా వ్యవహరిస్తున్నారు. రూ.12కోట్లతో 1.8కిలోమీటర్ల నాలుగులైన్ల రోడ్డుతోపాటు సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేపట్టిన ఆర్‌అండ్‌బీశాఖదే వీధిలైట్ల వ్యవహారమని ట్రాన్స్‌కో అధికారులు, ఈ వీధి లైట్ల సమస్య పరిష్కరించాల్సిన ట్రాన్స్‌కో అధికారులని మునిసిపల్ అధికారులు, ఆలైట్లతో తమకేమీ సంబంధం లేదని మునిసిపల్, ట్రాన్స్‌కో శాఖలే ఆసమస్యను పరిష్కరించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు బాధ్యతల నుంచి తప్పించుకుంటూ ప్రజలను కటిక చీకట్లలోనే ఉంచుతున్నారు. అంతేకాకుండా గతంలో ఉన్న 9మీటర్ల విద్యుత్ స్తంభాలు, తీగెలను ఇప్పుడు తొలగిస్తున్నారు. 11మీటర్ల పొడవు ఉన్న స్తంభాలు వేసి విద్యుత్ వేశారు. ఇంతక ముందు స్తంభాలకు ఉన్న వీధిలైట్లను పాత స్తంభాలతోపాటు తొలగించి కొత్త స్తంభాలకు మళ్లీ ఆలైట్లను అమర్చలేదు. ఆవీధిలైట్ల వ్యవహారం మునిసిపల్ అధికారులదేనని తమ బాధ్యత కాదని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. కోట్లాది రూపాయలతో రోడ్డు అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ నిర్మిస్తున్నందున ఈ స్తంభాలకు లైట్లు అవసరం లేదనే వాదన కూడా వినిపిస్తున్నారు. 11నెలల కిందట మొదలైన ఈ రోడ్డు పనులు ఇప్పటివరకు కేవలం పదిశాతం కూడా కాలేదు. సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టలేదు. సెంట్రల్ లైటింగ్ నిర్మాణంతో నిమిత్తం లేకుండా వెంటనే గతంలో మాదిరిగా మునిసిపల్ అధికారులు కొత్తగా వేసిన విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు అమర్చి రాత్రివేళ చీకటి నుంచి వెలుగులు నింపాలని స్థానికులు కోరుతున్నారు.



తీగలను తొలగిస్తున్న విద్యుత్ అధికారులు



కారుచీకట్లో మధిర-జగ్గయ్యపేట రోడ్డు

## 10శాతం రాయితీతో రాజధానిలో ప్రయాణం

» సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని ఏసీ బస్సులో ఈనెలాఖరు వరకు 10శాతం రాయితీతో ప్రయాణం చేయవచ్చునని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు. సత్తుపల్లి డిపోలో శుక్రవారం కస్టమర్ డే సందర్భంగా ప్రయాణికులకు గులాబీ పువ్వులను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతితక్కువ ధరతో వివాహాది శుభకార్యాలకు, విహారయాత్రలకు అద్దెకు బస్సులను అందిస్తున్నట్లు చెప్పారు. గమ్యం యాప్ ద్వారా ఆర్టీసీ బస్సులు ఏప్రాంతంలో ఉన్నాయి, ఎప్పటికీ చేరుకుంటాయనే వివరాలను తెలుసుకోవచ్చునన్నారు. అనంతరం ఆరేళ్లుగా అశ్వారావుపేట నుంచి సత్తుపల్లికి ఆర్టీసీలో ప్రయాణిస్తున్న ప్రయాణీకురాలు డీ.రేణుకను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ సిలివేరు సాహితితో పాటు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలి

ముదిగొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెడువ్యసనాలకు అలవాటు పడకుండా సమాజాభివృద్ధిలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా పీవో శ్రీనివాస్ సూచించారు శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో మేరా భారత్ కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలను లోనై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎయిడ్స్, కరోనా వంటి జబ్బులను అరికట్టడానికి గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఉన్నత చదివి గ్రామానికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాసిరెడ్డి శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా పీవో శ్రీనివాస్

## ఏపీఎం, సీసీలపై కేసు నమోదు

తల్లాడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వేతనం అడిగేందుకు వచ్చిన గ్రామదీపిక పట్ల దురుసుగా ప్రవర్తించిన వెలుగు ఏపీఎం, ఇద్దరు సీసీలపై గురువారం రాత్రి తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అక్టోబరు 24వతేదీన తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామదీపిక వరపర్ల దుర్గా తనకు రావాల్సిన వేతనం గురించి ఏపీఎం చిన్న వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చేందుకు రాగా, ఆసమయంలో ఏపీఎం, సీసీలు సుందర్‌రావు, నర్సింహారావులు దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్‌ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కలగా మిగిలిన 'కల్లూరు మునిసిపాలిటీ'

కల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసే మునిసిపాలిటీల జాబితాలో రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కల్లూరుకు చోటు దక్కలేదు. పూర్వపు సమితి, ప్రస్తుత రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మునిసిపాలిటీ ఏర్పాటుకు అవసరమైన జనాభా, మౌలిక సౌకర్యాలు ఉన్నా కల్లూరుకు మునిసిపాలిటీగా ఏర్పాటు కాకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. శుక్రవారం అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా 2 కార్పొరేషన్లు, 12 మునిసిపాలిటీలు ఏర్పాటుకు ఆమోదం తెలపడం జరిగింది. వీటిలో తెలంగాణ రాష్ట్రంలో మేజర్ పంచాయతీ అయిన (పెద్దదైన) కల్లూరు మునిసిపాలిటీగా ప్రకటించక పోవడంతో ఇక ఇప్పటికీ మునిసిపాలిటీగా కావడం ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా కల్లూరు మునిసిపాలిటీని చేసే విషయంలో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు కూడా పంపడం జరిగిందని తెలిసింది. నాటి పాలకులు కూడా హామీ ఇచ్చారు కాని, ప్రభుత్వం మారడంతో అది కార్యరూపం దాల్చలేదు. మండలం నుంచి మంత్రి వర్గంలో పొంగులేటి శ్రీనవాసరెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ నుంచి అధికార పార్టీ ఎమ్మెల్యేగా మట్టా రాగమయి ప్రాతినిధ్యం వహిస్తున్నా, కల్లూరు మునిసిపాలిటీ చేసే విషయంలో తగిన చొరవ చూపలేక పోయారని స్థానికుల్లో అసంతృప్తి నెలకొన్నది. ఇక ఈ ప్రభుత్వంలో కల్లూరు మునిసిపాలిటీగా రూపాంతరం చేందే అవకాశం చేజారి పోయినట్లేనని స్థానికులు భావిస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి: ఆర్డీవో

తల్లాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ ఆదేశిచారు. శుక్రవారం తల్లాడ మండలం మల్సూర్ తండా, రంగంబంజర, నూతనకల్ గ్రామాల్లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ ఖాజామోహిద్దీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గనియాతండ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సర్వే బృందాలకు సూచించారు. ఈ నెల 24 తేదిలోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సర్వే చేపట్టాలన్నారు. సర్వేలో అర్హులైన వారిని గుర్తించాలని ఆయన సర్వే బృందాలను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బోనకల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకోట గ్రామంలో శుక్రవారం పాస్టర్ సుంకర రామారావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుల చేతుల మీదుగా వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న కిషోర్ కుమార్, ఆనందరావు

## 'మంచిమార్గం వైపు నడిపించడమే ధనుర్మాసం'

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అందరిని మంచిమార్గం వైపు నడిపించడమే ధనుర్మాసమని ప్రముఖ ప్రవచనకర్త, ఉపన్యాస రత్న రామకృష్ణమాచార్య అన్నారు. మండలంలోని రేజర్లలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ధనుర్మాస వైభవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలో కూడా రెండు కోణాలు ఉంటాయని, మంచీ చెడులు రెండూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో మందపాటి కేశవరెడ్డి, నున్నా రాంబాబు, గజేంద్రరావు, ఎల్లయ్య, ఒగ్గు పుల్లారెడ్డి, బీమిరెడ్డి నరసింహారెడ్డి, వెంకటరామిరెడ్డి, వసంతలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, కృష్ణస్వామి, రామారావు, శ్రీను పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రామకృష్ణమాచార్య

## 'పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి'

చింతకాని, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పనులు పూర్తి చేసుకున్న పాఠశాలలకు పూర్తిస్థాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎక్కువ నిధులు వినియోగించిన పాఠశాలలకు రీ ఎస్టిమేషన్ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తోటకూరి శ్రీనివాసరావు, ఉదారపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ కిసాన్‌సంఘ్ మండల కమిటీ ఎన్నిక

కొణిజర్ల, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండల భారతీయ కిసాన్‌సంఘ్ అధ్యక్షుడిగా తనికెళ్లకు చెందిన బండారు సత్యనారాయణ, కార్యదర్శిగా పెదమళ్ల శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. శుక్రవారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో జరిగిన సమావేశంలో వారిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సంఘ్ ఖమ్మంజోన్ కార్యదర్శి మందనపు రామారావు, కొండపర్తి నరేష్, కవిడ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొండకొడియలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

వైరా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి: మండలంలోని కొండకొడిమ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సాంఘీక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్, మండల స్పెషలాఫీర్ అయిన కస్తాల సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. రైతులు శుభ్రం చేసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని, ప్రభుత్వం సన్నరకాలకు ఇచ్చే బోనస్ ద్వారా లబ్ధిపొందాలని సూచించారు. ఐకేపీ కేంద్ర ఇన్‌చార్జి కస్తాల వినోద, నాయకులు, రైతులు సర్వనేని అశోక్, వేలాద్రి, నూకల వెంకటేశ్వర్లు, అచ్చాలు, వాకదాని వెంకటేశ్వరరావు, పగవరపు శ్రీనివాసరావు, దొంతెబోయిన రామకృష్ణ, పగడవరపు పుల్లారావు, అశోక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 12మంది పేకాట రాయుళ్ల అరెస్టు

వైరా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 13వ వార్డు గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో నడుస్తున్న పేకాట స్థారంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. 12మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.80,500నగదును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతి ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్న 12మంది పేకాట రాయుళ్లను వైరా పోలీసులకు అప్పగించారు. మూడు కార్లు, ద్వి చక్ర వాహనం,11 సెల్‌ఫోన్లలను స్వాధీనం చేసుకొని, వారిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎస్‌ఐని కలిసిన హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు

కల్లూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ హరితను శుక్రవారం ఆల్ ఇండియా హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేఆర్‌టీ రాజన్న, ఖమ్మం ఉమ్మడి జిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వినుకొండ శ్రీనువాసరావులు మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్‌ఐ హరితకు నూతన సంవత్సర డైరీని బహుకరించి అభినందనలు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

బోనకల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బోనకల్ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌కు తాత్కాలిక పద్ధతిలో ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో)గా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కంపెనీ ఛైర్మన్ షేక్ రెహానా, ఏపీఎం పద్మలతలు తెలిపారు. బీఎస్సీ అగ్రికల్చర్ మార్కెటింగ్, డిప్లోమా తత్సమాన అర్హతలు కలిగి ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసి ఉండాలన్నారు. ఈ నెల 28వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో పూర్తి చేసిన దరఖాస్తులు అందజేయాలని కోరారు.

## విద్యార్థుల అభివృద్ధే అందరి లక్ష్యం

వైరా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడమే తల్లిదండ్రులు, అధ్యాపకుల మొదటి లక్ష్యమని వైరా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎల్.నవీనజ్యోతి పేర్కొన్నారు. శుక్రవార వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సంభాషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు టీనేజీ వయస్సులో మంచి, చెడులపై ఆలోచన చేయలేరని ఈ సమయంలో వారిపై అనేక దుష్ప్రరిణామాలు పడే అవకాశముందన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీపీఎం జిల్లా కమిటీలో మధిర నుంచి ఇద్దరికి చోటు

మధిర రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ ఖమ్మం జిల్లా కమిటీలోకి మధిర నుంచి ఇద్దరికి చోటు లభించిం ది. శీలం నర్సింహారావు, మందా సైదులును జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యల పట్ల సీపీఎం పార్టీ నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందన్నారు.



నర్సింహారావు



సైదులు

## కార్మిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

» టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు వెంకన్న

కల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) కార్మిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి రామయ్యలు పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరులో నిర్వహించిన ఏరియా మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. 126 సంవత్సరాల క్రితం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న సమ్మె హక్కుపై మోదీ ప్రభుత్వం దాడి కొనసాగుతుందని విమర్శించారు. పెరిగిన ధరలకు అణుగుణంగా కార్మికుల వేతనాలను పెంచాలని కోరారు. తెలంగాణలో ప్రజాపాలన అని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక పైపు వేతనాలు పెంచాలని ఆందళోన చేస్తున్న జీపీ, మునిసిపాలిటీ, ఆశా వర్కర్లను పోలీసులతో అరెస్ట్ చేయించడం సరియైంది కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు కార్మికుల శ్రమను దేశంలో పెట్టుబడిదారులైన ఆదాని, అంబానీలకు దోచి పెడుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఏరియా కార్యదర్శి కే పుల్లారావు, బాబు, అమర్లపూడి శరత్, యస్‌కె. లాల్‌మియా, కార్మిక సంఘం కల్లూరు డివిజన్ కార్యదర్శి బి. లాజరులు పాల్గొని ప్రసంగించారు.

టీయూసీఐ కల్లూరు ఏరియా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి. సత్యం, కార్యదర్శిగా కె. పుల్లారావు, ఉపాధ్యక్షులుగా సీతయ్య ఏడుకొండలు, సహాయ కార్యదర్శులుగా నాగేశ్వరరావు, మాల్యాద్రి, కోశాధికారిగా పున్నయ్య, 12 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## గ్రామసభ అడ్డగింత

ఏన్కూరు, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): రూ.25కోట్లతో పూర్తిగా పంట కాలవలకు నీరు అందించే ఉద్దేశ్యంతో 17 ఎల్ సీతారామ కాలవ నిర్మాణ భూసేకరణ గ్రామసభను గిరిజనులు అడ్డుకున్నారు. శుక్రవారం నాచారం, మేడేపల్లి గ్రామాల్లో తహసీల్దర్ శేషగిరిరావు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభలు పీసా చట్టానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని, పీసా కమిటీసభ్యులకు సమాచారం అందించలేదని గ్రామసభను గిరిజనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాజేందర్ మాట్లాడుతూ ముందుగా గ్రామస్థులకు సమాచారం తెలియజేయాలన్న ఉద్దేశ్యంతోనే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. పీసా కమిటీలకు తెలిపే మరోసారి సభలు నిర్వహిస్తామన్నారు. అందరి ఆమోదంతోనే నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ మధు, జేఈ వంశీ, డీఏవో వెంకటేశ్వరరావు, గ్రామప్రత్యేక అధికారి అనూష, పంచాయతీ కార్యదర్శులు సురేస్, మహబూబి, మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న గిరిజనులు

## 'విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి'

వైరా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విలువలతో కూడిన విద్యనార్జించాలని ప్రముఖ సైకాలజిస్ట్, కెరీర్ కౌన్సిలర్ సుధీర్ సంద్ర సూచించారు. వైరాలోని న్యూలిటిల్‌ప్లవర్ పాఠశాలలో శుక్రవారం పిల్లలకు విలువలు అందించడంలో తల్లిదండ్రుల పాత్ర అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుధీర్‌ను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్లు డాక్ట్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్ సన్మానించారు. ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, ఏవో ఎస్.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యంతో మానసిక ప్రశాంతత

» బాల సాహిత్యవేత్త సయ్యద్ షఫీ

బోనకల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సాహిత్యం చదవడం ద్వార విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందుతుందని బాల సాహిత్యవేత్త సయ్యద్ షఫీ తెలిపారు. మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కథలు, రచనామేళా కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. చదువుతో పాటు సాహిత్యంలోనూ రాణించాలని సూచించారు. అనంతరం షఫీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దామాల పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెనుబల్లిలో ధాన్యం ఎగుమతి ప్రారంభం

పెనుబల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలోని కొనుగోలు కేంద్రంలో 20రోజులుగా నిలిచిపోయిన ధాన్యం ఎగుమతులు ఎట్టకేలకు శుక్రవా రం ప్రారంభమయ్యాయి. 'బయటి ధాన్యాన్ని తరలిస్తున్నారని లారీ అడ్డగిం త' అనే శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికా రులు స్పందించారు. 20రోజులుగా ధాన్యాన్ని మిల్లర్లకు తరలించాలని రైతులు కోరుతున్నప్పటికీ ఐకేపీ సిబ్బంది మిల్లర్లు ఐదుకేజీల తరుగు అడుతున్నారని పేచీలు పెడుతున్నారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం ఎలాంటి తరుగు లేకుండానే కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. ఇదే తరహాలో గురువారం రాత్రి మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో కూడా ఐకేపీ సిబ్బంది ఐదుకేజీల తరుగు ఇస్తేనే మిల్లులకు తరలిస్తామని భీష్మించడంతో అక్కడి రైతులు సొంతంగా లారీ ఏర్పాటుచేసుకొని ఎలాంటి తరుగు లేకుండానే మిల్లులకు తమ ధాన్యాన్ని తరలించారు. మిల్లర్లు కూడా ఎలాంటి తరుగు లేకుండానే ధాన్యాన్ని దిగుమతి చేసుకున్నారని తెలుపుతున్నారు.



పెనుబల్లి ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న దృశ్యం

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

మధిర రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని కనకపూడి కావేరి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తోట నర్సింహారావు తెలిపారు. ఖమ్మం జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో విద్యార్థిని కావేరి ప్రతిభను కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. డిసెంబరు 31వతేదీన మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థిని కావేరిని ఉపాధ్యాయులు అభినందించారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

» ఈజీఎస్ ఏపీడీ సీహెచ్.శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈజీఎస్ ఏపీడీ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 16వ విడత సత్తుపల్లి మండల సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం 21పంచాయితీలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. 2023-24సంవత్సరానికి గానూ మొత్తం 433పనులకు గానూ రూ.3.60 కోట్ల పనులు జరగగా రూ.65,889 లెక్కలలో తేడాలున్నట్లు తేలిందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ విజిలెన్స్ ఆఫీసర్ జత్రియనాయక్, క్లస్టర్ ఏపీడీ వెంకటరాజు, అంబుడ్స్‌మెన్ రమేష్, క్యూసీ వీరయ్య, సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పీ సాంబశివచారి, ఏఈవో పవన్‌కుమార్, సూపరింటెండెంట్ శాస్త్రీ, ఎస్‌టీవో నరేష్, ఎంపీడీవో ఆర్‌సీహెచ్.నాగేశ్వరరావు, ఈజీఎస్ ఏపీవో ఎం.బాబు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులను సకాలంలో అందించని ప్రభుత్వం

» బీఆర్‌ఎస్ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు ఎస్‌కే.రఫీ, యాగంటి శ్రీను

సత్తుపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సకాలంలో అందించడంలో అధికారులు విఫలమైనట్లు శుక్రవారం ఒక ప్రకటనలో బీఆర్‌ఎస్ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు ఎస్‌కే.రఫీ, యాగంటి శ్రీనులు తెలిపారు. ఈనెల19వ తేదీన హడావుడిగా 13 మంది లబ్ధిదారులకు చెక్కులను ఇవ్వగా అవి అప్పటికే గడువు ముగియడంతో బ్యాంకు అధికారులు తిప్పిపంపించిన విషయం విధితమే. ఈ క్రమంలో అధికారుల అలసత్వం, పాలకులు నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హయంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అంగరంగ వైభవంగా పెళ్లికుమార్తెకు చీరెను బహూకరించి భోజనం పెట్టి మరీ పంపించారని గుర్తు చేశారు. ఇప్పుడు కనీసం సకాంలో చెక్కులను ఆడబిడ్డలకు ఇవ్వలేని పరిస్థితి ఎదురైందన్నారు. లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉ మామహేశ్వరరావు, కూసంపూడి రామారావు, దొడ్డా శంకరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మల్లూరు అంకంరాజు తదితరులు ఉన్నారు.